

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, జులై 28, ప్రభాతవార్త** : మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి సోమవారం సాయంత్రానికి 12,121 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 30.525 టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350 ఎన్ఎఫ్‌సికి 320, పెన్నా డెల్టాకు 1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 91.738 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## చెన్నై సూళ్లూరుపేట EMU రైల్ సేవలను నాయుడుపేట వరకు పొడిగించండి

### కేంద్ర రైల్వే సహాయ మంత్రికి ఎంపీ వేమిరెడ్డి వినతి



**నెల్లూరు రూరల్, జులై 28, ప్రభాతవార్త** ప్రస్తుతం చెన్నై సూళ్లూరు పేట మధ్య నడుస్తున్న EMU రైల్ సేవలను నాయుడు పేట వరకు పొడిగించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గారు కేంద్ర రైల్వే సహాయ మంత్రి శ్రీ వీరన్న సోమన్న గారికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు ఢిల్లీలోని కేంద్ర మంత్రి కార్యాలయంలో సోమన్నను కలసిన ఎంపీ వేమిరెడ్డి నాయుడుపేటలోని సదరన్ రైల్వే ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఇచ్చిన వినతి పత్రాన్ని అందించారు. నాయుడుపేటతో సహా తిరుపతి జిల్లాలోని చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నివాసితులు, ఉద్యోగులు, వ్యాపార వ్యక్తులు, సాధారణ ప్రజల విజ్ఞప్తి మేరకు చెన్నై సూళ్లూరుపేట మధ్య నడుస్తున్న EMU రైలు సేవలను నాయుడుపేట వరకు పొడిగించడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఇటీవల నాయుడుపేట ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, దాంతో కార్మికులు, విద్యార్థులు, సాధారణ ప్రజల రోజువారీ ప్రయాణ అవసరాలు పెరిగాయన్నారు. ముఖ్యంగా చెన్నైకి ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం, చెన్నై సూళ్లూరుపేట మధ్య 11 ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (EMU) రైళ్లు నడుస్తున్నాయన్నారు. నాయుడుపేటకు 20 కి.మీ దూరంలో సూళ్లూరుపేట వరకే EMU సేవలు ముగియడంతో, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాంతో ఇతర ప్రత్యామ్నాయ రవాణా మార్గాలపై ఆధారపడాల్సి వస్తోందని చెప్పారు. EMU సేవలను నాయుడుపేట వరకు పొడిగించడం వల్ల చుట్టుపక్కల మండలాలు, గ్రామాల నుండి 5 లక్షల మంది జనాభాకు ప్రయోజనం చేకూరుతుందని, చెన్నై, నాయుడుపేట సమీపంలోని పారిశ్రామిక ప్రాంతాలకు ప్రయాణించే శ్రామికులకు ఉపయోగమన్నారు. దాంతోపాటు అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ఆర్థిక కార్యకలాపాలు, కనెక్టివిటీ మెరుగుపడుతుందని వివరించారు. ఈ పొడిగింపు చెన్నైతిరుపతి కారిడార్‌లో నాయుడుపేటకు పెరుగుతున్న డిమాండ్‌ను, వ్యూహాత్మక ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అలాగే సామా జికంగా ప్రయోజనకరంగా, ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని వివరించారు. ఈ నేపథ్యంలో వినతిని పరిశీలించి EMU సేవల ను సూళ్లూరుపేట నుండి నాయుడుపేటకు విస్తరించేందుకు వీలైనంత త్వరగా చర్యలు తీసుకునేందుకు సంబంధిత రైల్వే అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

## బీద రవిచంద్రకి శుభాకాంక్షలు



**నెల్లూరు, జులై 28, ప్రభాత వార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, చైర్మన్ కొయ్యే మోషేనురాజు ఆంధ్రప్రదేశ్ శాషనసభ, శాసనమండలి సభ్యులతో 2025-26 సంవత్స రానికి ఉభయ సభల సంయుక్త కమిటీలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిటీ చైర్మన్, శాసనమండలి సభా నియమాల కమిటీ సభ్యుడిగా శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర నియమితులైన సందర్భంగా నెల్లూరులో వారి నివాసంలో కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపిన ఐటీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షులు షేక్ రసూల్.

## ఫిర్యాదుల పరిష్కార విషయంలో అలసత్వం తగదు

**వచ్చిన దరఖాస్తులను బియాండ్ ఎస్ఎల్ఏ పోకుండా చూడాలి**

**పరిష్కార వేదికకు మొత్తం 450 ఫిర్యాదులు**

**సత్వరం పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులకు ఆదేశం**

**జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్**



**నెల్లూరు కలెక్టరేట్, జులై 28, ప్రభాతవార్త** ప్రజా ఫిర్యాదులు పరిష్కరించే విషయంలో కొన్ని శాఖలు వెనుకంజలో ఉన్నాయని వాటిని సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ జాయింట్ కలెక్టర్ కె కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ రావు, డిఆర్‌డిఏ పిడి నాగ రాజకుమారి ప్రజల వద్ద స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కొన్ని శాఖలు బియాండ్ ఎస్ఎల్ఏ పోకుండా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. అంతే కాకుండా ప్రతి శాఖ కూడా ప్రజా ఫిర్యాదులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదుల విషయంలో అలసత్వం ఉండకూడదని ఫిర్యాదుల పరిష్కార విషయంలో అలసత్వం ఉండకూడదని వచ్చిన ఫిర్యాదులను ఆయా శాఖ అధికారులకు అందజేసి త్వరితగతిన పరిష్కరించాల్సిందిగా జిల్లా కలెక్టర్ అధికారులను సూచించారు. ఫిర్యాదుల పరిష్కార విషయంలో అలసత్వం ఉండకూడదని తెలిపారు.

**పరిష్కార వేదికకు 450 ఫిర్యాదులు** సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 450 ఫిర్యాదులు అందాయని అందులో అధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించి 160, సర్వే అండ్ రికార్డ్స్‌కు సంబంధించి 52, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ 32, పంచాయితీ రాజ్ 36, స్కూల్ ఎడ్యుకేషన్ 25, పోలీస్ శాఖకు సంబంధించి 43 మిగతావి ఉన్నాయన్నారు.

## పారిశుధ్య నిర్వహణకు ప్రజలందరూ సహకరించాలి : కమిషనర్ వై.ఓ నందన్



**నెల్లూరు కార్పొరేషన్ జులై 28 ప్రభాతవార్త** : నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య నిర్వహణ పనులకు నగర ప్రజలంతా సహకరించి వ్యర్థాలను వీధుల్లో వేయకుండా, నిర్దేశించిన డస్ట్ బిన్లలో మాత్రమే వేసి స్వచ్ఛ నెల్లూరు సాకారానికి సహకరించాలని కమిషనర్ వై.ఓ నందన్ విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలందరూ గృహ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయకుండా, వీధుల్లో ఏర్పాటు చేసిన డస్ట్ బిన్స్ లో మాత్రమే వేయాలని సూచించారు. టిడ్కో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనున్నామని తెలిపారు. వివిధ కారణాలవల్ల లబ్ధిదారులకు కొన్ని గృహాలు మంజూరు కాలేదని, వాటికోసం గతంలో చెల్లించిన మొత్తాలను తిరిగి లబ్ధిదారులకు అందిస్తామని కమిషనర్ వెల్లడించారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని స్థానిక సమస్యలను కమాండ్ కంట్రోల్ విభాగంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కి ఫోన్ ద్వారా తెలియజేస్తే తక్షణమే స్పందించి ఫిర్యాదును పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను 94940 18118 నెంబరుకు వాట్సప్ ద్వారా లేదా 1800 425 1113 టోల్ ఫ్రీ నెంబరు కు ఉదయం 6:00 గంటల నుంచి సాయంత్రం 6:00 గంటల లోపు తెలియజేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ అంశాలపై ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని, వాటన్నింటికీ నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విభాగాల వారీగా అకౌంట్ సెక్షన్ 2, ఆప్కాస్ 2, ఇంజనీరింగ్ 9, టిడ్కో హౌసింగ్ 15, రెవెన్యూ 2, టౌన్ ప్లానింగ్ 5, పబ్లిక్ హెల్త్ 4, హెచ్ సెక్షన్ 3, పెన్షన్ 1, మొత్తం 43 అర్జీలను కమిషనర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. నిర్దేశించిన సమయంలోపు సమస్యలన్నిటిని పరిష్కరించాలని విభాగాల ఉన్నతాధికారులను ఆదేశించారు. నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సెక్రటరీ శ్రీలక్ష్మి, సిటీ ప్లానర్ హిమబిందు, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నాం

### - దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి





**చేజర్ల జులై 28 ప్రభాతవార్త** గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం తూర్పు కంభంపాడు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు పలు అభివృద్ధి కార్యక్రమాలు పాల్గొని ప్రారంబోత్స వాలు శంకుస్థాపనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు గత 5 సంవత్సరాలు వైసిపి పాలనలో ఆనాటి ప్రభుత్వం 10.5 లక్షల కోట్లు రూపాయాల అప్పులను ప్రజలపై రుద్దిందని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటన్నింటిని అధికమించి ఇచ్చిన ప్రతి హామిని అంచలంచలుగా అమలు చేస్తు ప్రజా సంక్షేమమే పరమావాధిగా రాష్ట్ర అభివృద్ధే ద్యేయంగా ముందుకు సాగుతుందని అన్నారు. ఇంత ఆర్థిక ఇబ్బందులలోను ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక వసతులు కల్పిస్తు సంక్షేమ పథకాలు సైతం అదే తరహాలో కొనసాగిస్తుందని అన్నారు.

❖ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కార్యదక్షత అపార అనుభవంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని పేర్కున్నారు. నిత్యం పరిశ్రమలను ఆహ్వానిస్తు ఉద్యోగ కల్పనకు కృషి చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామి మేరకు ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్‌ను 4 వేలు,6 వేలు,10 వేలు, 15 వేలు పెంచి పేదల కళ్ళలలో ఆనందం నింపినట్లు తెలిపారు. అలాగే ఉచితంగా 3 దీపం సిలిండర్లను అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు తల్లికి వందనం పథకం ద్వారా ఎంత మంది బిడ్డలు ఉంటే అందరికి 13 వేల రూపాయాలు తల్లిఖాతాలో జమ చేస్తున్నామని అన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు 20 వేల రూపాయాలు 3 దపాలుగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆగష్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించినున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం హాయాంలో చేపట్టిన సంక్షేమపథకాలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి వారి ఆశీస్సులు తీసుకుంటున్నామని అన్నారు.

**మెట్ట ప్రాంత యువత ఉజ్వల భవిష్యత్తుకోసమే మెగా జాబ్ మేళా**

ఎన్‌డిఎ కూటమి నాయకులంతా సమిష్ట జాబ్ మేళా విజయవంతం కోసమే పనిచేస్తున్నామని మంత్రి ఆనం తెలిపారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆద్వర్యంలో మంత్రి నారాలోకేష్ సహకారంతో ఆత్మకూరులో మెగా జాబ్ మేళాను ఆగష్టు 1,2 వ తేదిలలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. గతంలో ఎన్నడు కూడా ఆత్మకూరులో ఇంత పెద్దఎత్తున జాబ్ మేళా జరగలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుడు జి. సతీష్‌రెడ్డి , మంత్రి నారాయణ ,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ జాబ్ మేళాకు హాజరౌతారని తెలిపారు. ఆత్మకూరులో ప్రభుత్వ ఐటిఐ, పాలిటెక్నిక్, ప్రవేటు ఇంజనీరింగ్ కళాశాలలో సాంకేతిక విద్యనభ్యసించి ఖాళీగా ఉన్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధీ అవకాశాలు కల్పించడమే జాబ్ మేళా లక్ష్యమని పేర్కున్నారు. 59 సాఫ్ట్‌వేర్ కంపె నీలు ఈ జాబ్ మేళాలలో పాల్గొంటాయని వివరిం చారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సింగపూర్ పర్యటనకు వెళ్లారని అన్నారు. అందర్ని కలుపు కుంటు రాష్ట్రంలో పరిశ్రమలకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన ప్రతి మాట నెరవేరుస్తు ప్రజల నమ్మకం నిలబెట్టుకోవడమే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వ పనిచేస్తుందని అన్నారు.

**మంత్రికి ఘన స్వాగతం**

రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి తూర్పు కంభం పాడు గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీనాయకులు, మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివాసులునాయుడు, మాజీ సర్పంచ్ కొమ్మి రమేష్‌నాయుడు ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలలతో అభిమానులు, తెలుగుదేశం పార్టీనాయకులు మంత్రిని ఘనంగా సత్కరించారు. 4 రకాల డప్పు వాయిద్యాలతో మేళతాళాలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అలాగే ఉరేగింపులో దారి పొడవునా పూలతో స్వాగతం పలికారు. అంతకు ముందు ప్రముఖ పుణ్యక్షేత్రమైన కోటితీర్థంలోని కోటేశ్వరస్వామి దేవాలయంలో మంత్రి ఆనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలని భగవంతుడ్ని ప్రార్దించారు. తెలుగు దేశం పార్టీనాయకులు కిమ్స్ హాస్పటల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ తాళ్లూరు గిరినాయుడు, అన్నలూరు శ్రీనివాసులునాయుడు, కొమ్మి రమేష్‌నాయుడు, కొమ్మి సిద్దుల నాయుడు, షేక్ సిరాజ్‌ద్దీన్, రావి పెంచల రెడ్డి, కేశవ చౌదరి, అచ్చాల నారాయణరెడ్డి, రావి లక్ష్మీ నరసారెడ్డి, కొమ్మి పార్ధసారదినాయుడు, మోదేపల్లి పెంచలనాయుడు, చీర్ల వెంకటేశ్వర్లు, గోనుగుంట రాంబాబు, అనంతనేని బాబు, జువ్వగుంట బాబు, శ్రీదర్‌నాయుడు, హాజరత్‌నాయుడు, మల్లినేని రామూర్తి నాయుడు, సిఐ వేమా రెడ్డి, తహసిల్దారు మురళీ, ఎంపిడిఒ జి. అమర్, ఎస్ఐలు తిరుమలరావు, రాజేష్, మండల అధికారులు ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## విద్యార్థుల్లో ఉపాధి సామర్థ్యాలను పెంచేందుకే అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ఫ్రోగ్రామ్స్

### - ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర మంత్రి సమాచారం - వృత్తి విద్యతో నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి అభివృద్ధికి దోహదం చేస్తుందని వెల్లడి



**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త - వైద్యం** విద్యార్థుల్లో ఉపాధి సామర్థ్యాలను పెంచేందుకు అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ఫ్రోగ్రామ్స్‌ను తీసుకుని వచ్చినట్లు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. సోమవారం లోకసభలో నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నైపుణ్యాభివృద్ధి అంశంపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ఫ్రోగ్రామ్‌లను అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తుందా అని ఎంపీ ఆరా తీశారు. ఈ డిగ్రీలతో నైపుణ్యం ఉన్న వ్యక్తులను విదేశీ క్లయింట్ సైట్‌లలో నియమించాలని ప్రభుత్వం యోచిస్తోందనేది నిజమేనా అని ప్రశ్నించారు. విద్యా మంత్రిత్వ శాఖ, నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ మధ్య ఇబ్బందులు తలెత్తకుండా అప్రెంటిస్‌లు, యజమానులకు మధ్య సమన్వయం మెరుగుపరచడానికి సర్టిఫికేషన్, డేటా షేరింగ్, ఔట్రీచ్‌ల కోసం యూనిఫాం అప్రెంటిస్‌షిప్ పోర్టల్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తుందా అని వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నలకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి 2020-21 కేంద్ర బడ్జెట్‌లో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ/ డిప్లామా ఫ్రోగ్రామ్ ప్రకటించబడిందన్నారు. ఏఐసీటీఈ కూడా తన పరిధిలోని సంస్థలకు దీన్ని గురించి తెలియజేసిందన్నారు. ఈ డిగ్రీపై మార్గదర్శకాలను రూపొందించడానికి విద్యా మంత్రిత్వ శాఖ జూన్ 6, 2023 న ఒక కమిటీని ఏర్పాటు చేయగా కమిటీ తగిన మార్గదర్శకాలను రూపొందించినట్లు వివరించారు. ఏఈడీపీ మార్గదర్శకాలు డిగ్రీ/ డిప్లామా అప్రెంటిస్‌షిప్ లను ప్రోత్సహించడానికి, నాణ్యమైన అప్రెంటిస్‌షిప్ శిక్షణను నిర్ధారించడానికి, పరిశ్రమ- సంస్థల సహకారాన్ని పెంపొందించడానికి నియంత్రణ ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి ఉపయోగపడతాయన్నారు. ఏఈడీపీ మార్గదర్శకాలను విద్యా మంత్రిత్వ శాఖ నవంబర్ 4, 2024 ఆమోదించిందన్నారు. అయితే ఉన్నత విద్యను పరిశ్రమల అవసరాలతో అనుసంధానించడంలో అప్రెంటిస్‌షిప్ గణనీయమైన పాత్ర వహిస్తున్న నేపథ్యంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ యుజీసీ చట్టం ప్రకారం యుజీసీ పేర్కొన్న విధంగా అన్ని విభాగాలలో అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ డిగ్రీ ఫ్రోగ్రామ్‌ను అందించడానికి ఉన్నత విద్యా సంస్థలకు మార్గదర్శకాలు ప్రారంభించింది. నైపుణ్య ఆధారిత విద్య కోసం యుజీసీ ప్రాధాన్యత ఇస్తుండగా, అప్రెంటిస్‌షిప్ ఈ ప్రాధాన్యత సాధారణ విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని మెరుగుపరిచే దిశగా సాగుతున్నాయి. అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలోనే విద్యార్థుల ఉపాధి సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా పని చేస్తోంది. అన్ని డిగ్రీల్లో ఫలితాల ఆధారిత అభ్యాసంపై దృష్టి పెట్టడం, కావాల్సిన నైపుణ్య స్థాయిలను సాధించడం ఉన్నత విద్యా సంస్థలు, పరిశ్రమలు/ స్థాపనల మధ్య క్రియాశీల సంబంధానిన ప్రోత్సహించడం, ఉన్నత విద్యా సంస్థలు లేదా బోర్డు ఆఫ్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ బోర్డు ఆఫ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ భాగస్వామ్యంతో ఏఈడీపీని సమర్ధవంతంగా అమలు చేయడం ఇందులో ప్రధానాంశాలుగా ఉన్నాయన్నారు. దేశంలో 1961 అప్రెంటిస్ చట్టం కింద ఏర్పాటైన సెంట్రల్ అప్రెంటిస్‌షిప్ కౌన్సిల్ జాతీయ అప్రెంటిస్‌షిప్ విధానాలను రూపొందించడంలో పరిశ్రమ డిమాండ్లతో వృత్తి శిక్షణను సులభతరం చేయడంలో ఆర్థిక వ్యవస్థలోని విభిన్న రంగాలలో అవకాశాలను విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. 2025 మే 26న జరిగిన సీఏసీ యొక్క 38వ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు.. దేశ అప్రెంటిస్‌షిప్ పర్యావరణ వ్యవస్థను ఆధునీకరించడంలో ఒక ముఖ్యమైన ముందడుగని చెప్పారు. అప్రెంటిస్ శిక్షణ కాలంలో దేశంలోని లేదా విదేశాలలో క్లయింట్ స్థానాల్లో అప్రెంటిస్‌షిప్‌లను నియమించడానికి సంస్థలకు వీలు కల్పిస్తూ సిఫార్సు చేసిందన్నారు. సీఏసీ సిఫార్సును ప్రభుత్వం పరిగణలోకి తీసుకుందన్నారు. ఉన్నత విద్యాశాఖతో సంప్రదించి ఇటీవల ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లు, డిప్లామా హోల్డర్లు, శాండ్ విచ్ ఇంజనీరింగ్ కోర్సులలో విద్యార్థులు బీఏ, బీకాం, బీఎస్సీ వంటి సాధారణ గ్రాడ్యుయేట్లు కోసం అప్రెంటిస్‌షిప్ ఫ్రోగ్రామ్‌లను డీహెచ్‌ఈ కొనసాగించాలని నిర్ణయించారు. అన్ని ఇతర వర్గాల అప్రెంటిస్‌లకు అప్రెంటిస్‌షిప్ ఫ్రోగ్రామ్‌లకు కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ బాధ్యత వహిస్తుందన్నారు. ఆప్షనల్ ట్రేడ్‌ల గురించి జూన్ 16, 2023 న ఎంఎస్‌డీఈ ఒక స్పష్టతను కూడా జారీ చేసింది. ఎన్ఏపీఎస్, ఎన్ఏటీఎస్ రెండింటి యొక్క ఐటీ ప్లాట్‌ఫారమ్‌ల ప్రక్రియ భిన్నంగా ఉన్నట్లు కొనుగొనబడిందని కానీ వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి, సమస్యలను తగ్గించడానికి రెండు పోర్టల్‌లకు ఉమ్మడి యాక్సెస్ పాయింట్‌ను తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు.

## పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడమే పి 4 లక్ష్యం



**నెల్లూరు కలెక్టరేట్, జులై 28, ప్రభాతవార్త** జిల్లాలో పి4 కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని శాఖల అధికారులు తమవంతు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పి4లో భాగంగా బంగారు కుటుంబాలు, మార్గదర్శిల ఎంపికపై అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి పేదరికాన్ని పూర్తిగా చుట్టారని జిల్లా స్థాయి అదధికారులందరూ తమ శాఖల పరిధిలో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 10 వేలకు పైగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శిలు ముందుకొచ్చారన్నారు. ప్రభుత్వం పిలుపుమేరకు మానవతాహృదయంతో పేదలకు చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చిన మార్గదర్శిల స్ఫూర్తిని పది మందికి తెలిసేలా వారికి సత్కరించి గౌరవించాలని సూచించారు. పేదరికంలో ఉన్న బంగారు కుటుంబాలను గుర్తించడం, ఆంర్థికంగా స్థిర పడిన మార్గదర్శిలను ఎంపిక చేసేందుకు గ్రామ సభలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అన్ని శాఖల అధికారులు బంగారు కుటఉంబాలను ఎంపిక చేసి మార్గదర్శిలు దత్తత తీసుకునేలా కార్యక్రమం పై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమ ఉద్దేశాన్ని తమ శాఖల పరిధిలోని కిందిస్థాయి సిబ్బంది ద్వారాక్షేత్ర స్థాయిలోకి తతీసుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపివో నరసింహారావు, జడ్పి సిఈవో మోహన్ రాజు, హౌసింగ్ పిడి వేణుగోపాల్, డ్వామా పిడి గంగాభవాని, ఉద్యానవనశాఖాధికారి సుబ్బారెడ్డి, డిఎంఅండ్‌హెచ్‌ఒ సుజాత, ఐసిడిఎస్ మెప్మా పిడిలు హేనాసుజన్, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



**కోవూరు జులై28 ప్రభాతవార్త :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు , మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 31వ తేదిన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు దర్గామిట్టలోని సుజాతమ్మ కాలనీలోని ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి రానున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు రూరల్ , నగర డీఎస్పీలు జి. శ్రీనివాస్, సింధుప్రియలు , సీఐలు, ఎస్సైలతో కలిసి మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రూరల్ వైసీపీ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిలతో ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో మాజీ ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చేపట్టవలసిన భద్రతా ఏర్పాట్లపై ఈ సందర్భంగా పోలీసు ఉన్నతాధికారులు చర్చించారు.

## కండలేరులో 27.010 టీయంసీల నీటిమట్టం



**కండలేరుడ్యాం (రాపూరు), జులై 28, ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో సోమవారం ఉదయం నాటికి జళాశయంలో 27.010 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జళాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2085 క్యూసెక్కులు, లో లేవల్ స్ల్యూయిస్ ద్వారా 70 క్యూసెక్కులు, చోప్పున మొత్తం 2155 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సీపీఎం భారీ ఉద్యమానికి శ్రీకారం



**కోవూరు జూలై28 ప్రభాతవార్త :** సామాన్యులకు భారంగా మారబో తున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సీతాపోలయ్య భవనంలో కరపత్రా లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఫిబ్రవరి 26వ తేదిన గెజిట్ నెంబర్ 921,922,924ను విడుదల చేసి ప్రజల నుంచి మీటరు కొనుగోలు ఖర్చు కింద ప్రతి నెల బిల్లుల్లో వసూలు చేయాలని నిర్ణయించడం ప్రజాదోపిడీ కాదా అని అన్నారు. గతంలో ఇదే ప్రభుత్వం అధికారంలో లేనప్పుడు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించిన విషయం మరిచిపోతే ఎలా అన్నారు. ఇప్పటికైనా స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించడం మానుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అనంతరం సీపీఎం పార్టీ మండల కమిటీ ఏర్పాటు చేసిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కరపత్రాలను మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రతి ఇంటికి కరపత్రాన్ని పార్టీ కార్యకర్తలు అందించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బుజ్జయ్య, సుబ్బారావు, బాబు, హరి, పెద్దబ్బయ్య, అఫ్రోజ్, మల్లికార్జున్‌రెడ్డి, చాన్‌బాషా, ఫాతిమా, సురేంద్ర, యస్థానిలు ఉన్నారు.

## అర్హులైన వారికి ఇళ్ల స్థలాల మంజూరుకు కసరత్తు

**– ఇప్పటి వరకు సచివాలయాల ద్వారా 740 మంది ఇళ్ల స్థలాల కోసం అర్జీలు సమర్పించారు**

**నెల్లూరు అగ్రికల్చర్, జులై 28, ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆదేశానుసారంగా ఇల్లు లేని పేదలకు, ఇండ్ల స్థలాల మంజూరుకు కసరత్తు ప్రారంభించామని నెల్లూరు అర్బన్ తహశీల్దార్ షఫీ మాలిక్ తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన వార్త ప్రతినిధితో మాట్లాడారు. అర్హులైన పేదలకు గూడు కల్పించేందుకు ప్రభుత్వం సన్నద్ధమైందన్నారు. ఇందుకోసం తమ పరిధిలో ఇండ్ల స్థలాలు మంజూరు చేసేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. అర్బన్ శివారు ప్రాంతాల్లో స్థల పరిశీలన చేయమని క్రిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. రానున్న మూడు నాలుగు నెలల్లో భూసేకరణ చేపట్టి పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. పొట్టేపాలెం, కొండ్లపూడి ఏరియాలో అనువైన ప్రాంతాన్ని ఇళ్ల స్థలాల కోసం సేకరించబోతున్నట్లు చెప్పారు. ప్రతి లబ్దిదారుడికి 12 అంకణాల స్థలాన్ని, ఇల్లు నిర్మించుకునేందుకు కేటాయించబోతున్నామన్నారు. నగర పరిధిలో రేషన్ కార్డు కలిగిన వారు, ఒక లక్ష 20 వేల వార్షిక ఆదాయం కలిగిన వారు ఇండ్ల స్థలాల మంజూరుకు అర్హులని తెలిపారు. ఆదాయ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు ఇందుకు అనర్హులని తెలియజేశారు. ఇందులో ఆరంచెల వెరిఫికేషన్ పూర్తి చేసిన తర్వాత అర్హులను ప్రకటించేందుకు అవకాశం ఉందన్నారు. ఇండ్ల స్థలం లేని పేదవారు తమ పరిధిలోని సచివాలయాలలో ఇండ్ల స్థలం కోసం అప్లై చేసుకోవచ్చన్నారు.



## సీజనల్ వ్యాధులపై అవగాహన చేసుకోవాలి



**కోవూరు జూలై28 ప్రభాతవార్త :** కోవూరు మండలం లేగుంటపాడు దళితవాడ ప్రాంతంలో సోమవారం ఇనమడుగు ప్రభుత్వ హోమియో వైద్యులు కరుణాకర్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండడమే కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హోమియోలో అనేక జబ్బులను నయం చేసే మందులు ఉన్నాయన్నారు. వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఈ శిబిరానికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్ పరిశీలించి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీమ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో సుపరిపాలనలో తొలి అడుగు



**కావలి, రూరల్, జులై28, ప్రభాతవార్త :** కావలి శాసనసభ్యుడు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలతో ఆంధ్రప్రదేశ్‌రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగ చేపట్టిన సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్ర మంలో సోమవారం స్థానిక 20వ వార్డులో ఘనంగా నిర్వహించారు. తొలుత వార్డు మాజీ కౌన్సిలర్ పాలడుగు అనూరాద నివాసంనుంచి డోర్‌టుడోర్ కార్యక్రమం చేపట్టారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అందజేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పదకాలను సంబందించిన కరపత్రాలను అంద జేసి కూటమి ప్రభుత్వం అందిస్తున్నఅభివృద్ది సంక్షేమ పదకాలను వివరిం చారు. ఈ కార్యక్రమంలో కోక్లస్టర్ ఇన్‌చార్జ్‌లు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, అమరా వేదగిరిసుబరాయుడుగుప్త, తిరివీది ప్రసాద్, తెలుగు యువత పట్టణ అద్యక్షుడుకావేటి శివకుమార్, 89వ పిఎస్ కన్వీనర్ పసుపులేటి చంద్రశేఖర్, 90వ పిఎస్ కన్వీనర్ ఒంగోలు ప్రభుచరణ్, కోకన్వీనర్ సాయి, టిడిపి నేతలు రాయిపాటి దిలిప్‌కు మార్, అలహరి నరసిం హారావు, శిఖరంసురేష్. నువ్వుశెట్టి రూపేష్, పాలడుగు మురళీకృష్ణ, టిడిపి నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌డే సద్వినియోగం చేసుకోండి



**మనుబోలు జులై 28 ప్రభాతవార్త ;** గ్రీవెన్స్‌డే సందర్భంగా మనుబోలు తహసిల్దారు కార్యాలయంలో సోమవారం తహసిల్దారు రమాదేవి పలు సమస్యలపై లబ్దిదారులు నుండి అర్జీలను స్వీకరించారు. సర్వేకి సంబందించి రెండు రెవిన్యూ కి రెండు అర్జీలు వచ్చాయని వాటిని ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి నిర్ణీత కాల వ్యవధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతి సోమవారం కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌డేను రైతులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రీవెన్స్‌డే రోజున అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండి ఆయా శాకాలకు సంబంధించిన సమస్యలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. ఈకార్య క్రమంలో డిటి ప్రతాప్, డిప్యూటి ఎంపిడిఒ నారాయణ, ఏవో ముజీబున్నీసా, ఎంఇఒ రమేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## మన చరిత్ర స్మృతులే హరిహరవీరమల్లు..!



**వింజమూరు, జులై 28, ప్రభాతవార్త :** మనచరిత్ర స్మృతులే హరిహరవీరమల్లు సినిమా కథా సారాంశమని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరులోని శిరీష థియేటర్లో ఉప ముఖ్య మంత్రి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అద్భుతంగా నటించిన హరిహరవీరమల్లు నియోజకవర్గంలోని జనసేన వీర మహిళలు వీక్షించేందుకు ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వీర మహిళల కోసం ఉచిత సినిమా ప్రదర్శన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరయ్యారు. ఎమ్మెల్యే థియేటర్ వద్దకు రావడంతో వీర మహిళలు జనసేన నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఎమ్మెల్యే వారితో కలిసి హరిహరవీర మల్లు చిత్రంను వీక్షించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి విచ్చేసిన జనసేన నాయకులు వీర మహిళలు సినిమా థియేటర్లో వీలలు కేరింతలతో సినిమాను చూశారు. సినిమా డైరెక్టర్ అద్భుతంగా గత చరిత్రను తెలియజేస్తూ కోహినూరు వజ్రం గురించి తెలియజేస్తూ సినిమాను తీయడం జరిగిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సినిమా అద్భుతంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో వెళ్లి చూడదగిన చిత్రంగా అభివర్ణించారు. ఈ సినిమాను నిర్మించిన నిర్మాత డైరెక్టర్ సినిమా బృందానికి, అభిమానులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం జనసేన ఆధ్వర్యంలో సినిమా థియేటర్లో పని చేసే వర్కర్లకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, జనసేన అధ్యక్షులు బండారు సత్యనారాయణ, సురేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రసూల్, సురేంద్ర, రవి, కమతం శ్రీనివాసులు, అల్లూరి రవీంద్ర, రాము, గవ్వల వెంకీ, షేక్ ఇమ్రాన్, మహేష్, కిరణ్, బి.రవి, బీజేపీ మండల అధ్యక్షులు దేగ మధు యాదవ్, అభిమానులు, మహిళలు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**కావలిరూరల్, జూలై28ప్రభాతవార్త :** కావలి మండలం గౌరవరం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మునునురు అరుంధతీయ వాడకు చెందిన పోతిపోక వెంకయ్య(38) మృతి చెందినట్లు కావలి రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి తెలిపారు. మృతుడు బిటెక్ చదివి ఉద్యోగ ప్రయత్నాలలో వున్నాడన్నారు. గౌరవరంలో వున్న మృతుని సోదరి బుజ్జమ్మకు వాంతులు, విరోచనాలు అవుతుండటంతో తనకు కొబ్బరి నీరు తెచ్చివ్వమని అడగడంతో మృతుడు వెంకయ్య మోటర్ సైకిల్‌పై గౌరవరం వెలుతుండగా మార్గమద్యంలో ఎన్ఎల్ 01 బి 7333 నంబరు గల ప్రవేటు వాహనం గుద్దడంతో వెంకయ్య మృతి చెందాడన్నారు. ఈ మేరకు మృతుని బార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## దళితుల భూముల సమస్యలను పరిష్కరించాలి



**బిట్రగుంట, జులై 28, ప్రభాతవార్త:** దళితుల భూముల సమస్యలను పరిష్కరించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. గ్రీవెన్స్‌డే సందర్భంగా సోమవారం బోగోలు తహసిల్‌దార్ కార్యాలయంవద్ద ఎస్ మల్లి ఆధ్వర్యంలో నిరసన తెలిపి తహసిల్‌దార్ శ్రీనివాసులరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి మాట్లాడారు. బోగోలు మండలం నాగులవరం, చెన్నారెడ్డిపాళెం గ్రామాలలో భూములు ఆక్రమించుకున్నారని తెలిపారు. కేశవరప కుమారమ్మకు చెందిన 333 సర్వేనంబర్‌లోగల భూమిని చేరెడ్డి సుబ్బరామిరెడ్డి ఆక్రమించుకున్నారని తెలి పాడు. కుమారమ్మ ఉపాదిపనులకోసం చెనై వెళ్ళిందన్నారు. ఆమె పొలం ఆక్రమించుకొని పదిహేను సంవత్సరాలనుంచి సాగుచేసుకుంటుందని చెప్పారు. ఆమెభూమిని అమ్మడంకాని, ఇవ్వడంకాని చెయ్యలేదని ప్రక్క భూమిని ఆక్రమించుకొని ఈమె భూమినికూడ ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తొలగమంటే దళితులని అవమానకరంగ మాట్లాడుతున్నారని తెలిపారు. దళితుల భూములు ఒక్కొక్కరెడ్డి 25 ఎకరాలదాక ఆక్రమించుకొని వున్నారని అన్నారు. 1981వ సంవత్సరంలో సిజెఎఫ్ఎస్ కింద 3ఎకరాలదాక పంపిణి చేశారన్నారు. ఈపంపిణిచేసిన భూములు మొత్తం కూడ గ్రామ పెత్తందార్లు ఆక్రమించుకొని సాగుబడి చేసుకుం టున్నారన్నారు. చేతిలో పదో, పరకోపెట్టి సాగు బడి చేసుకుంటున్నారని తెలిపారు. కుమారమ్మ ఎవరికి అమ్మ లేదని తహసిల్‌దార్‌కు విన్నవించడం బహిరంగ విచారణ జరుపుతామని ఎవరి భూములు అన్యాక్రాం తమైన తిరిగి తీసుకుంటామని తహసిల్‌దార్ వివరించినట్లు తెలియజేశారు. ఈకార్యక్రమంలో జడ్డా వాసు ఆత్మకూరు తేజ, భూహక్కుదారులైన కేశవరపు కుమారమ్మలు పాల్గొన్నారు.

## ఆర్టీసి ఆదాయం పెంచేలా చర్యలు తీసుకోవాలి



**రాపూరు, జూలై28ప్రభాతవార్త :** ఆర్టీసికి ఆదాయం పెంచేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆర్టీసి నెల్లూరు జోన్ 3 ఈడి అప్పల రాజు కోరారు. సోమవారం ఆయన రాపూరు ఆర్టీసి డిపోను ఆకస్మికంగా తనిఖీ చేసి డిపోలోని అన్ని విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆదికారులతో కలసి ఆర్టీసి డిపో ప్రాంగణంలో చెట్లను నాటారు. ఈ సందర్భంగా గ్యారేజి సిబ్బందికి, డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు సరియైన కండిషన్ వుండే బస్సులను ఇవ్వాలని, బ్రేక్ డౌన్స్ పూర్తిగా తగ్గించాలని కోరారు. కండక్టర్‌లు, డ్రైవర్‌లు ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలన్నారు. తద్వారా సంస్థ గౌరవం పెంచలన్నారు. బస్టాండ్ ఆవరణలో పరిశుభ్రతతో పాటు మౌళిక వసతులు వుండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈయన వెంట డిప్యూటీ సిటియం హెచ్ఓ మాధవ త్రినాధ్, నెల్లూరు సిటియం రమేష్, రాపూరు డిపో మేనేజర్ వై. అనీల్ కుమార్, గ్యారేజ్ సూపర్‌వైజర్లు, ట్రాఫిక్, సెక్యూరిటీ, ఆఫీసు సిబ్బంది తదితరులున్నారు.

## శానిటరీ కార్మికుల అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి




**కావలిరూరల్, జూలై28ప్రభాతవార్త :** రాష్ట ప్రభుత్వం నగర మరియు పట్టణ మున్సిపాలిటీలలో శానిటరీ కార్మికుల అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కార్మికులను పర్మినెంట్ చేయాలని పార్వర్డ్ బ్లాక్ రాష్ట ప్రధాన కార్యదర్శి పి.వి. సుందర్ రామరాజు డిమాండ్ చేశారు. నేతాజి మున్సిపల్ కార్మికుల యూనియన్(టియుసిసి) యూనియన్ పతాకావిష్కరణ కార్యక్రమం సోమవారం కావలి మున్సిపల్ కార్యలయం ఎదుట నిర్వహించారు. టియుసిసి కేంద్ర కమిటీ సభ్యుడు టి.రామచంద్రయ్య ఆధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్వర్డ్ బ్లాక్ రాష్ట ప్రధాన కార్యదర్శి పివి సుందర రామరాజు మాట్లాడుతూ 1920 నాటి కార్మిక చట్టాలను కూడా నేడు కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు నీర్వీర్యం చేస్తున్నాయని, ఉద్యోగ భద్రత లేకుండా పని గంటలు, కనీస వేతనాలు వేతన ఒప్పందాలు జరిగిన దాఖలాలు కనిపించడం లేదని, ప్రభుత్వాలు భాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్న కారణం చేత ప్రభుత్వ అధికారులు కూడా ఆదే భాటలో నడుస్తున్నారని అన్నారు. కావలి మున్సిపలిటీలో 400 మంది శానిటరీ సిబ్బంది వుండగా దానిలో 40 మంది మాత్రమే పర్మినెంట్ వారు అని మిగిలిన వారంతా ఔట్ సోర్సింగ్ లోనే పని భద్రత లేకుండా విధులు కోనసాగిస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ ఉద్యోగులుగా తీసుకోవాలని అందుకోసం టియుసిసి రాష్ట వ్యాప్త కార్యాచరణ కోనసాగిస్తుందన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాశం నరసింహ రావు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన అంతర్జాతియ జాతియ గుర్తింపు పొందిన కార్మిక సంఘం టియుసీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. కావలి నేతాజి మున్సిపల్ కార్మికుల యూనియన్ వ్యవస్థాపక ఆధ్యక్షుడు కావలి యేసు కావలి మున్సిపల్ కార్మికులు ఎదుర్కోంటున్న సమస్యలు, రాజకీయ ఒత్తిడితో ఔట్‌సోర్సింగ్ కార్మికులకు, భద్రత లేకుండా పోయిందని యూనియన్ అండతో కార్మికుల భద్రతకు కార్మికులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధారావత్ రవి, శెట్టిపల్లి అధిలక్ష్మీ, ఎన్. ఎలమందయ్య, కావలి కోండమ్మ, కావలి అధిశేషయ్య, శెట్టిపల్లి హైమావతి, శెట్టిపల్లి కోండయ్య, కర్రేటి కేటేశ్వరమ్మ, పలువురు మున్సిపల్ కార్మికులు వున్నారు.

## కోనలో లక్ష్మీ నృసింహుని నిత్యాన్న ప్రసాదానికి రూ.1,18,000 విరాళం



**పెంచలకోన(రాపూరు), జూలై28ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహుని నిత్యాన్నదాన ప్రసాదానికి సోమవారం దాతలు రూ.1,18,000 విరాళం ఆందజేశారు. రైల్వే కోడూరుకు చెందిన నాలబాల ఆనంద్ కుమార్, వారి ధర్మపత్ని రోహిణిలతలు ముందుగా స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి నిత్య అన్నదానానికి సంబందించి రూ. 1,18,000లు విరాళాన్ని ఆలయ సిబ్బందికి ఆందజేయడం జరిగింది.

## పేదల అకలీ తీర్చిన ఎన్ఆర్ఐలు



**కావలిరూరల్, జూలై28ప్రభాతవార్త :** సంయుక్త సేవా సంస్థ ఆధ్వర్యంలో కీ.శే గోలే చంద్రశేఖర్ 17వ వర్ధంతి సందర్భంగా కావలి పట్టణ నివాసులు వృత్తిరిత్యా విదేశాలలో వుంటున్న వారి అక్క, బావలైన వాకాటి మహేంద్ర, శ్రీదేవి దంపతు లు సంస్థ వ్యవస్థాపక ఆధ్యక్షుడు సురేంద్ర ద్వారా సోమవారం పేదలకు అన్నదానం నిర్వహించారు. కావలి పట్టణం పరిసర ప్రాంతమైన పాత వినాయక గిరిజన కాలనీలో 100 మంది పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక ఆధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ వాకాటి మహేంద్ర, శ్రీదేవిలు వృత్తిరిత్యా విధేశాలలో వున్నప్పటికి పుట్టిన గడ్డపై మమకారంతో సంయుక్త సేవా సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేయడమే కాకుండా సంస్థ ద్వారా చేస్తున్న సేవలకు తమ వంతు సాయం అందిస్తూ తోడ్పాటు నిస్తున్నారని తెలిపారు. దీనిలో బాగంగానే నేడు పేదలకు అన్నదానం చేసిన వారికి ధన్యవాదాలను తెలుపు తున్నట్లు చెప్పారు. కీ.శే గోలే చంద్రశేఖర్ అత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## ఫిర్యాదు పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారంటూ ఎస్‌పికి ఫిర్యాదు

**నెల్లూరుక్రైమ్ జులై 28 ప్రభాతవార్త :** నాబిడ్డను నాకళ్ళ ఎదుటే దుర్మార్గంగా కొట్టి గాయపంచినందుకుగాను వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలంటు ఈక్రమంలో గత పది నెలల నుండి స్దానిక పోలిస్‌స్టేషన్‌లో సబ్‌ఇనస్పెక్టర్, సర్కిల్ ఇనస్పెక్టర్లకు ఫిర్యాదు చేసినప్పటికి న్యాయం జరగలేదంటు జిల్లా పోలీసు అధికారి వద్ద కలువాయి మండలం కుల్లూరు గ్రామానికి చెందిన బత్తల గురుస్వామి తన గోడు విన్నవించుకున్నారు. తనకు జరిగిన అన్యాయంపై స్దానిక పోలిస్‌స్టేషనందు అదే విధంగా రాపూరు సర్కిల్ ఇనస్పెక్టర్ వద్ద 18-9-2024 న ఫిర్యాదు చేసినప్పటికి ఎస్ఐ ఆర్ 82/ 224 ఇంత వరకు చార్జి షీటు కట్టలేదంటు జిల్లాఎస్‌పి కార్యాలయం నందు సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కేంద్రం నందు ఇచ్చిన వినతి పత్రంలో వారు పేర్కున్నారు. పలు దపాల జిల్లా అధికారి కార్యాలయానికి రావడం ఇక్కడ నుండి కిందస్దాయి అధికారులకి వీళ్ళు పంపడం, అక్కడికి వెళ్ళడం వల్ల ఇటువంటి ప్రయోజనాలు లేకపోవడంఇదే విధంగా కొనసాగుతుందని. నాకు న్యాయం చేయాలని బత్తల గురుస్వామి ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి కృష్ణకాంత్ వద్ద మొరపెట్టుకున్నారు.

## మీకు ఇచ్చేది పదువులు కాదు బాధ్యత



**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త -వైద్యం :** విజయవాడలోని కాలేశ్వరరావు మార్కెట్ వద్ద గల ఇంచాద్ ఘర్ కాంప్లెక్స్ లోని వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో ఏపీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన 5వ వక్ఫ్‌బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమావేశంలో ప్రవేశ పెట్టిన అజెండాలపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. బోర్డు సమావేశ అనంతరం గత బోర్డు సమావేశంలో నియమించిన పలు ముతవల్లీలు, మేనేజింగ్ కమిటీల వారితో ఆయన సమావేశం నిర్వహించి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మీకు ఇచ్చేది పదువులు కాదని బాధ్యతని ఇస్తున్నామని అన్నారు. గతంలో వక్ఫ్‌బోర్డు ద్వారా ముస్లిం సమాజానికి ఎటువంటి సంక్షేమం జరగలేదని అన్నారు. గతంలో ఎంతో మంది దాతలు వేల ఎకరాలు దానం చేసి వెళ్లారు. దాదాపు 70 వేల ఎకరాల భూమిలో 30 వేల ఎకరాలు ఆక్రమణకు గురై మన చేతుల్లో లేకుండా పోయింది. మిగిలిన భూముల్లో దాదాపు 15 వేల ఎకరాలు ప్రభుత్వం అక్వైర్ చేసుకుందని అన్నారు. ముస్లిం విద్యార్థుల కోసం నూతన ఉచిత విద్యా పథకాన్ని ప్రారంభించబోతున్నామని ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. రాబోవు విద్యా సంవత్సరంలో 500 మంది ప్రతిభావంతమైన విద్యార్థులకు ఉచిత రెసిడెన్షియల్ ఉన్నత ఇంటర్మీడియట్ విద్యను అందించబోతున్నామని తెలిపారు. ప్రతి వక్ఫ్ బోర్డు సంస్థ ఆదాయానికి అనుగుణంగా విద్యార్థులను దత్తత తీసుకోవాలని అన్నారు. మీమీ సంస్థలలో ఆదాయాన్ని పెంచి విద్యార్థుల చదువుకు ఉపయోగపడాలని అన్నారు. మీ సొంత పిల్లలను చదివించిన భావనతో వారి బాధ్యత తీసుకోండి. దేవుడి ఆస్తులను చౌకగా కోరుకోకూడదని, ప్రీమియంగా తీసుకోవాలని అన్నారు. ఒక విద్యార్థిని సమాజం ఉన్నత చదువు చదివించాలని సమాజానికి తిరిగి మేలు చేస్తాడని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యతో పాటు ఉచిత ఐఏఎస్ కోచింగ్‌ను అందిస్తామని తెలిపారు. త్వరలో రాష్ట్రంలోని పలు చోట్ల స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు నేర్పించి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తామని తెలిపారు. అందరూ నాతో కలిసి నడవండి ముస్లిం సమాజాన్ని ఉన్నతమైన స్థానంలో నిలబెడతా సమావేశంలో బోర్డు సభ్యులైన శాసనసభ్యులు మొహమ్మద్ నజీర్, ఖాజా అక్రమ్, ఇస్మాయిల్ బేగ్, ఆఫియా, ముక్రం హుస్సేన్, బేపారి జాకీర్ అహమ్మద్, సీఈఓ మొహమ్మద్ అలీ, వక్ఫ్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేటుగా దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



**వలేటివారిపాలెం జులై 28, ప్రభాతవార్త :** ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వపాఠశాలలను తీర్చిదిద్దుతున్న ఘనత విద్యాశాఖామాత్యులు నారా లోకేష్‌కు దక్కుతుందని స్దానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగే శ్వరరావు అన్నారు. వలేటివారిపాలెం హైస్కూలులోని సభావేదికను ఇటీవల ఇటీవల దాతలు గుత్తా నరసింహం,శ్రీదేవి దంపతుల సహకారంతో నిర్మించారు. ఈ వేదికను సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు స్దానిక హెచ్ఎం కమలకుమార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రభుత్వపాఠశాలలో విద్యాభ్యాసం చేసిన అనేక మంది ఉన్నతస్దాయిలో ఉన్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు ఉజ్వల భవిష్యత్ సాధించాలని ఎమ్మెల్యే సూచించారు. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యావ్యవస్దలో సమూలమార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. టీచర్లు బదిలీలను పారదర్శకంగానిర్వహించినట్లు తెలిపారు. ప్రైవేటుగా దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌళికవసతులు బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. పీ4 కార్యక్రమంలోనూ, పాఠశాలల అభివృద్దిలోనూ ఎన్నారైలు, దాతలు ముందుకు రావాలని కోరారు. తొలుత సభాధ్యక్షులు కమల కుమార్ మాట్లాడుతూ పాఠశాల గొప్పతనాన్ని ,సాధించిన ఫలితాలను వివరించారు. ఇంకనూ ఈ పాఠశాలకు అవసరమైన లెవలింగ్, ఫ్లోరింగ్, అదనపు గదుల నిర్మాణం, ఆటస్దలం అభివృద్ది తదితర పనులను వివరిం చారు. ఇందుకు దాతలతోపాటు ప్రభుత్వమూ సహకరించెందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం, సర్పంచ్ సాధు శ్రీలత, డిప్యూటీ డీఈవో నరసింహం, తహసిల్దార్ మహమ్మద్ నయీమ్, ఎంపీడీవో నరేంద్రదేవ్, ఎంఈవో మల్లికార్జున, ఏఈ మధుబాబు, సీనియర్ అడ్వకేట్ శ్రీధర్‌నాయుడు, ప్రగడ శ్రీనివాసులు, తెదేపా నేతలు వలేటి మధు, వలేటి నరసింహం, సొసైటీ మాజీ అధ్యక్షులు వలేటి నరసింహం, గుత్తా మహేశ్వ రరావు, కొంకా రమేష్, మన్నం మాదవరావు, కాకుమాని మాల్యాద్రి, వీరమాసు ఆంజనేయులు, మాలకొండ మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, కూనిపాలెం సర్పంచ్ రాజారమేష్, మాజీ డీలరు కాకుమాని ఆంజనే యులు, సాధు చెన్నకేశవులు, చెరువుపల్లి సాంబయ్య, పోకూరు నుంచి లక్ష్మి నరసింహం, తిరుమలరావు, మాజీ జెడ్పీటీసీ కూచిపూడి విజయకుమార్, వెలుగు సీసీలు తిరుమల, మేరీ, కుమారి, వీవో నేతలు లక్ష్మిదేవి, శ్రీదేవి, నల్లబోతుల కొండలరావు, పోలినేనిచెరువు మాల్యాద్రి, అంకభూ పాలపురం నుంచి మోహన్, బక్కముంతల మాల్యాద్రి, చౌవ ర్రరాఘవులుతోపాటు పలు గ్రామాల నుంచి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వ్యతిరేఖించారు

### అధికారంలోకి వచ్చిన వెంటనే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు



**బుచ్చి జులై 28 ప్రభాతవార్త :** నారా చంద్రబాబునాయుడు ,నారాలోకేష్ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్‌మీటర్లు వ్యతిరే ఖించారని. అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని సిపిఎం నాయ కులు పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు విమర్శించారు. సిపిఎం పార్టీ కార్యాల యంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో వారు మాట్లా డుతు సిపిఎం పార్టీ తరపున స్మార్ట్ మీటర్లు వ్యతిరేఖిస్తు ప్రజలకు అవగాహన కల్పిస్తామని అన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రజలు వ్యతిరేకించాలని అన్నారు. ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం ఆపకపోతే సబ్ స్టేషన్లు ముట్టడి స్తామని పార్టీ తరపున వారు డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు చల్లకొలుసు మల్లికార్జునరావు, ఆవాజ్ జిల్లా ఉపాధ్యాక్షులు షేక్ జానీబాషా, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా, పార్టీనాయకులు పడవల సుబ్రమణ్యం, పముజుల శుభకుమార్ పాల్గొన్నారు.

## వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు పారిశుద్ధ్య కార్మికులను తరలించిన పోలీసులు



**నెల్లూరు క్రైం, జులై 28, ప్రభాతవార్త :** అయ్యప్ప గుడి సెంటర్ వద్ద మున్సిపల్ కార్మికులను అరెస్ట్ చేసి వేదాయపాలెం పోలీస్ స్టేషన్ కు సోమవారం తరలించారు. మా కార్మికులను అరెస్టు చేయడం అన్యాయం. పారిశుధ్య కార్మికులు ప్రశ్నించడాన్ని తట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. దళితులు గిరిజనులు అని చిన్న చూపుతో చూస్తున్నారని ఆరోపణలు. కార్మికులపై దాడులకు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నేతలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు సిపిఎం నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 14వ రోజుకు చేరుకుందని అయ్యప్ప గుడి సెంటర్ వద్ద పోటీ కార్మికులను పెట్టి పనిచేస్తున్న తెలుగుదేశం నాయకుల వద్దకు వెళ్లి మా కడుపులు కొట్టి మా పనులను కాంట్రాక్టర్లకు అప్పజెప్పి మీరు ఇలా చేయడం న్యాయమా అని ప్రశ్నిస్తున్న కార్మికులను దౌర్జన్యంగా అరెస్టు చేసి జీబులో వేసుకుని వేదాయపాలెం పోలీస్ స్టేషన్ కు తరలించారని చెప్పారు. వారితో పాటు వెంట నడిచి స్టేషన్ వెళ్లిన మిగతా కార్మికులు మా వారిని అన్యాయంగా అరెస్టు చేశారని వారిని వెంటనే విడుదల చేయాలని పోలీసులను కోరామని వివరించారు. ఇంతలోనే పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్న వేదయపాలెం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పోలీస్ స్టేషన్ ముందుకు వచ్చి మీరు ప్రశ్నిస్తారా అని బూతులు తిడుతూ లాఠీ తీసుకొని ఇష్టానుసారంగా కార్మికులను బెదిరిస్తూ వీరంగం సృష్టించారని ఆరోపించారు. భయభ్రాంతులకు గురైన కార్మికులు పరుగులు తీశారన్నారు. అక్కడ ఉన్న అనేకమందినికార్మికులను పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టారని బాధను వ్యక్త పరిచారు. సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ ను, రూరల్ సిఐటియు నాయకులను దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్ లోనికి దోచుకుంటూ వెళ్లారని ఈ తోపులాటలో కొంతమంది మహిళలకు పురుషులకు గాయాలయ్యాయి తెలియజేసారు. సమాచారం అందుకున్న మిగతా కార్మికులు యూనియన్ నాయకులు పెద్ద సంఖ్యలో వేదయపాలెం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని అక్రమంగా అరెస్టు చేసిన కార్మికులను వదిలి పెట్టాలని ఆందోళన చేశారు. యూనియన్ నాయకులతో చర్చలు జరిపి కార్మికులను విడుదల చేశారు. బయటకు వచ్చిన మహిళా కార్మికులు కన్నీళ్ల పెట్టుకుంటూ పోలీసులు తిట్టిన బూతులు వ్యవహరించిన తీరును మిగతా వారికి తెలియజేయడం అత్యంత విచారకరం అన్నారు. మా కడుపులు కొట్టొద్దు కాంట్రాక్టర్లకు మా పనులు అప్ప చెప్పొద్దు అని తమ గోడు వెళ్ళబోసుకుంటూ నిరవధిక సమ్మెలో ఉన్న కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించడం అత్యంత హేయమైన చర్య అనితెలిపారు. వేదయపాలెం సర్కిల్ ఇన్స్పెక్టర్ వ్యవహార శైలి అత్యంత దారుణంగా ఉన్నదని తెలిపారు. మహిళా కార్మి కులని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు బూతులుతిట్టడం, లాటితో ఇష్టానుసారంగా కొట్టడంకార్మికులపై ఉన్న చులకనా భావమే కారణమని అన్నారు. పాకీ పని చేసేవారు పారిశుద్ధ్య కార్మికులు దళితులు గిరిజనులు అనే చిన్న చూపుతో ఈ విధంగా వ్యవహరించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం సమస్యను పరిష్కరించకపోగా అధికారులతో పోలీసులతో దౌర్జన్యాలు చేయిస్తు న్నదని ఆరోపిం చారు. సిఐటియు నాయకులు జి నాగేశ్వ రరావు, పి సూర్యనారాయణ, కట్టాసతీష్, నర సింహారెడ్డి, శివాజీ, శంషాద్, షబ్బీ ర్, నాగేశ్వం రావు, నజీర్, అత్తి మూ రుశ్రీనివాసులు మున్సి పల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు...



## కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన సాధ్యం టిడిపి నాయకులు రాగాల శివకృష్ణ



**ముత్తుకూరు, జూలై 28, ప్రభాతవార్త :** కూటమి ప్రభుత్వంలోనే సుపరిపాలన సాధ్యమని టిడిపి సీనియర్ నాయకులు రాగాల శివకృష్ణ పేర్కొన్నారు. సోమవారం కృష్ణపట్నంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టిడిపి సీనియర్ నాయకులు రాగాల శివకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్ళి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు వివరిస్తూ కరపత్రాలను పంచి పెట్టారు. రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు పేదరిక నిర్మూలన ధ్యేయంగా పని చేస్తున్నారని కొనియాడారు. సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సర్వేపల్లి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చుతూ సుపరిపాలనలో తొలి అడుగు పూర్తి అయిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానాల చైర్మన్ మామిడాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## అలుగు కాలువ స్థలాలు రక్షించండి



**నెల్లూరు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త :** ఆత్మకూరులోని అలుగు కాలువ స్థలాలను రక్షించాలని ఆ గ్రామానికి చెందిన లక్కు ప్రసాద్ సోమవారం ప్రజా విజ్ఞప్తులు దినములు కలెక్టర్ ఓ ఆనంద్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు గ్రామంలోని సర్వే నెంబరు 898, 900 విస్తీర్ణం 3.36 సెంట్లుగా సర్వే నెంబర్ 902లో విస్తీర్ణం సున్నా 32 సెంట్లు ప్రభుత్వ భూమిగా నమోదు అయిందన్నారు. చెరువు అలుగు కాలువలుగా ఆర్ఎస్ఆర్ కాపీలో నమోదు చేయబడి ఉన్నాయన్నారు. రసం రామకృష్ణారెడ్డి ప్లాట్లు ఏర్పాటు చేశారన్నారు. సర్వే నెంబర్ 875, 891, 897, 896 సర్వే నెంబర్లతో పాటు అలుగు సర్వే నెంబర్ కూడా జత చేసి ప్లాట్లు వేశారని ఆయన తెలిపారు. దీని పై లోకాయుక్తలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. లోకాయుక్త సూచనలు మేరకు విజయవాడ ఇరిగేషన్ శాఖ ఆక్రమణలను తొలగించేందుకు 8.90 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ నిధులు కాలువ అక్రమణలు తొలగించడానికి ఉపయోగించకుండా వేరే విధంగా ఖర్చు చేశారన్నారు. ఇరిగేషన్ అధికారులు ఈ నిధులను దుర్వినియో గపరచాన్నారు. ఈ విషయాలపై దర్యాప్తు నిర్వహించి ఆక్రమణలకు గురి అయిన అలుగు కాలువ స్థలాలను రక్షించాలని ఆయన కోరారు.

## పార్కు స్థలాలను ప్లాట్లుగా విభజించే ఎంకే లేఅవుట్ పై చర్యలు తీసుకోండి

– జెసికి వినతి పత్రం అందజేసిన కటకం చైతన్య



**నెల్లూరు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త :** నెల్లూరు ధనలక్ష్మీపురం వావిలేటిపాడు, గ్రామ పంచాయితీ కార్పొరేషన్ లిమిట్స్‌లో చేరిన 17వ డివిజన్ మణికంఠ లేఔట్ అలియాన్ ఎంకే లే అవుట్‌లోని ఎల్‌పి నంబర్ 77/2007, 78/2007, 36/2007, 81/2007, 35/2007, 107/2007లో గల ప్లాట్‌లకు సంబంధించిన మున్సిపల్ కార్పొరేషన్‌లో చేరిన పార్కుస్థలాలను ప్లాట్లుగా విభజించి కోట్ల రూపాయలు సొ మ్ము చేసుకున్నారని కటకం చైతన్య ఈ విషయం పై తగు సమాచారాన్ని కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్తీక్‌కు ఇందుకు సంబంధించిన పత్రాలను ప్లానులను సమ ర్పించి వెంటనే ప్రజలకు ఉపయోగపడేందుకు లే అవుట్‌లో వదిలే 10 శాతం భూమిని అన్యాక్రాంతం కాకు ండా ప్రభుత్వానికి నష్టం కలిగించే ఇలాంటి చర్యలను వెంటనే అడ్డుకట్ట వేయాలని ఈ పార్కు స్థలాలను కాపాడి ప్రజలకు ప్రభుత్వానికి న్యాయం జరిగేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కటకం చైత న్య తెలిపారు.

## నా పొలం నాకు అప్పగించండి సార్



**నెల్లూరు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లాలోని కలువాయి మండలం తోపుకుంట రెవెన్యూ పరిధిలో వారికి సర్వే నెంబర్ 461లోని మూడవ లేఅవుట్‌లో ఎకరా 60 సెంట్లు భూమిని ప్రభుత్వం డి. సుబ్బారావు అమ్మకు పట్టా మంజూరు చేసిందని ఆమె కుమారుడు వెంకటేశ్వర్లు సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం కలెక్టరేట్ ఆనంద్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1997లో పట్టాకి ఇచ్చిందని ఈ సర్వే నెంబర్లు మొత్తం 5.27 సెంట్ల భూమి ఉన్నదన్నారు. అందులో సుబ్బారావు అమ్మకు 1.60 సెంట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. మిగిలిన భూమిని ఆ గ్రామానికి చెందిన ఇండ్ల చెంచయ్య అనే అతను ఆక్రమించుకొని సాగు చేసుకుంది. ఎలక్షన్‌లో టిడిపికి చేయలేదని కక్ష గట్టి సదరు ఇండ్ల చెంచయ్య చేత తన భూమిని కూడా ఆక్రమించుకోవాలని టిడిపి నాయకులు ఉసిగొలుపుతున్నారని దున్ని నిమ్మ మొక్కను నాటారని ఆయన పేర్కొన్నారు. అధికారులకు విన్నవిచ్చిన ఏమీ తెలుపలేదని దీని పై విచారణ చేపించి నా పట్టా పొలాన్ని నాకు ఇప్పించాలని ఆయన కోరారు. నాకు పొలం చుట్టు పక్కలకు వారిని రాకుండా చూడాలని ఆయన కోరారు.

## సంక్షేమ నిధిని పున ప్రారంభించండి



**నెల్లూరు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త :** భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధిని ప్రారంభించాలని ఏపి బిల్డర్స్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ ముక్తియార్ అధ్యక్షులు కే. ఆంజనేయులు సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినములు కలెక్టర్ ఓ. ఆనంద్ పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంక్షేమ నిధి ఐదేళ్లగా ప్రసూతి అస్వస్థత అంగవైకల్యం మరణాలకు సంబంధించి 40 వేలకు పైగా కార్మికుల క్లెయిమ్స్ చెల్లింపులో ఉన్నదన్నారు. జిల్లాలో ఐదు కోట్లకు పైగా చెల్లించవల్సి ఉందన్నారు. వెంటనే చెల్లించాలన్నారు. దారి మళ్లించిన 1400 కోట్ల నిధులు తిరిగి జమ చేయాలన్నారు. అధికారులు పై స్థాయి అధికారులు నివేదికలు పంపాలని వారు కోరారు.

## వీఆర్ఏ కనీస వేతనం ఇవ్వాలని కలెక్టరేట్ వద్ద ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త :** గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విఆర్‌సి గ్రౌండ్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు బందగి సాహెబ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. పెంచల నరసయ్య మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ సహాయకులకు గత ఎనిమిది సంవత్సరాల నుండి ఒక్క రూపాయి వేతనం కూడా పెంచలేదు. పనిభారం పెంచుతూ నైట్ డ్యూటీలు చేస్తున్నారు. పక్కనున్న తెలంగాణ రాష్ట్రంలో విఆర్ఏలందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పే స్కేలు అమలు చేస్తున్నారు. నామినిలుగా సంవత్సరాలు తరబడి పనిచేస్తున్న ప్రమోషన్లు ఇవ్వడం లేదు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి మండలాల్లో సైతం ప్రమోషన్ ఇవ్వకుండా తిరుపతి నెల్లూరు కలెక్టర్ కార్యాయాల చుట్టూ తిప్పుతున్నారు. పేరుకు ఇచ్చేది గౌరవ వేతనం కానీ ప్రభుత్వ ఉద్యోగులు అనే పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గతంలో ప్రతిపక్షంలో ఉన్న సందర్భంగా యువగలం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ విఆర్ఏల సమస్యల పరిష్కారం చేస్తామని జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి కావస్తున్నా ఇంత వరకు వీఆర్ఎల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి. లచ్చయ్య, ఓబులేసు, సుబ్బయ్య, సుధాకర్, అమీర్, శ్రీనివాసులు, నారాయణ, రమేష్, బాలు, అమరావతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి చంద్రబాబు దిక్సూచి



**నెల్లూరు రూరల్, జూలై 28, ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధికి కొత్త దిశ స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. 22వ డివిజన్‌లో 50 లక్షల రూపాయిలు వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఆయన మాట్లాడుతూ ప్రజల అభ్యర్థన మేరకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ డివిజన్ అభివృద్ధికి ఇప్పటి వరకు రూ. 3 కోట్ల 25 లక్షల నిధులు కేటాయించారు. ఇది ప్రగతి శీల పాలనకు నిదర్శనం అని పేర్కొన్నారు. అభివృద్ధి అనేది ప్రభుత్వ ధ్యేయం మాత్రమే కాక, ప్రజల భాగస్వామ్యంతో నెరవేరే సంకల్పం అని చెప్పిన ఎమ్మెల్యే చంద్రబాబు దృఢమైన నేతృత్వం రాష్ట్రానికి దిక్సూచిలా మారింది. ప్రజలు ఆశీస్సులతో ఆయన మరిన్ని సానుకూల మార్పులకు నాంది పలుకుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మూలే విజయభాస్కర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రాయ యానాదిరెడ్డి, బిజెపి నాయకులు యరబోలు రాజేష్, ఇతర ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నెల్లూరు-కడప పాతరోడ్డును పునరుద్ధరించాలి



**ఆత్మకూరు, జులై 28, ప్రభాతవార్త :** ఆత్మకూరు పట్టణప్రభుత్వ వైద్యశాల ప్రహరీగోడ ప్రక్కన గతంలో ఉన్న కడప నుండి నెల్లూరుకు వెళ్ళే రహదారిని పునరుద్ధరించాలని ఆత్మకూరు పట్టణ సిపిఎం పార్టీ కార్యదర్శి డేవిడ్‌రాజు, సిఐటియు నేత శివప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మెన్ సందాని, పార్టీ నేతలు, కార్యకర్తలు ఆత్మకూరు మున్సిపల్ కమీషనర్ గంగా ప్రసాద్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. బైపాస్‌రోడ్డులో గురుకుల పాఠశాల ప్రక్క నుండే డంపింగ్ యార్డ్ మీదుగా ప్రభుత్వ వైద్యశాల ఎక్కన నాగులపాడు రోడ్డు వరకు ఉన్న ఈ పాత రోడ్డు పట్టణ ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని అందువలన ఈ రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ఉపయోగపడేలా సిద్ధం చేయాలని వారు కోరారు. ఈరోడ్డు ఉండడం వలన పట్టణవాసులు నెల్లూరుకు వెళ్ళేందుకు , వాకర్స్ నడిచేందుకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, సిఐటియు నేతలు , కార్యకర్తలు హాజరయ్యారు.

## వైసీపీ పాలనలో నరకానికి నకళ్లుగా ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టళ్లు



**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త-వైద్యం :** నాడు వైసీపీ ప్రభుత్వం హయాంలో కళావిహీనంగా ఉన్న హాస్టళ్ళు, నేడు టీడీపీ హయాంలో సర్వాంగ సుందరంగా ముస్తాబు అవుతున్నాయి. ఐదు సంవత్సరాల తరువాత సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో రూ.143 కోట్లతో కనీస సౌకర్యాల కల్పన, మరమ్మత్తులు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం. డైట్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు కూడా వైసీపీ ప్రభుత్వం చెల్లించకుండా బకాయిలు పెడితే వాటిని కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రభుత్వ హాస్టళ్ల గురించి పట్టించుకోని వైసీపీ పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చాక హాస్టళ్లపై విపరీతమైన ప్రేమ వలకబోస్తున్నారు. దేశంలో మొదటి సారిగా ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు చికెన్ తో కూడిన భోజనం పెట్టే విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుది. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకర్ల సమావేశంలో తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పేద పిల్లలు ఉండే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో వైసీపీ ప్రభుత్వం తన ఐదు సంవత్సరాల పాలనలో కనీస సౌకర్యాల కూడా కల్పించలేదు. హాస్టళ్ల మరమ్మత్తులు చేపట్టలేదు. బాలికలు ఉన్న హాస్టళ్లలో టాయిలెట్స్‌కు తలుపులు కూడా సరిగా లేని పరిస్థితి. అక్కడ ఉంటున్న పిల్లలు నిత్యం దోమల్తో యుద్ధం చేస్తూ, అరాకొర వసతులతో విద్యను అభ్యసించాల్సిన పరిస్థితుల్లో ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల నరకానికి నకళ్ళుగా మారాయి. తెలుగుదేశం నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితిని చూసి, అక్కడ ఉంటున్న విద్యార్థులు పడుతున్న అవస్థలు చూసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చలించిపోయారు. పేద పిల్లలు ఉండే ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాల కల్పన, మరమ్మత్తులు కోసం వెంటనే రూ.143 కోట్లను ముఖ్యమంత్రి కేటాయించారు. అదే విధంగా బీసీ, ఎస్టీ,హాస్టళ్లలో కూడా కనీస సౌకర్యాలు కోసం నిధులు కేటాయించారు. దీంతో శిధిలావస్థకు చేరిన ప్రభుత్వ హాస్టళ్ల భవనాలకు మరమ్మత్తులు చేపట్టడంతో పాటు అధ్వాన్నంగా ఉన్న హాస్టళ్లలో కనీస సౌకర్యాల కల్పన యుద్ధ ప్రాతిపదికన జరుగుతుంది. నాడు వైసీపీ ప్రభుత్వ హయాంలో కళావిహీనంగా ఉన్న హాస్టళ్ళు, నేడు టీడీపీ హయాంలో సర్వాంగ సుందరంగా ముస్తాబు అవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిన స్కారల్ షిప్స్ కొరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.788 కోట్లు విడుతల చేసి పేద విద్యార్థులను ఆదుకొంది. 2014-19 మధ్య దేశంలోనే మొదటి సారిగా ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థులకు చికెన్‌తో కూడిన భోజనం పెట్టే విధానాన్ని ప్రవేశపెట్టిన దేశానికే చంద్రబాబునాయుడు ఆదర్శంగా నిలిచారు. 2024 కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారికి కావాల్సిన సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారికి నాణ్యమైన భోజనం పెడుతున్నారు. అయితే అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో ప్రభుత్వ హాస్టళ్ల విద్యార్థుల గురించి పట్టించుకోని వైసీపీ పార్టీ, నేడు ప్రతిపక్షంలోకి వచ్చిన తరువాత విమర్శలు చేయడం విడ్డూరంగా ఉంది. నాడు కళాహీనంగా ఉన్న ప్రభుత్వ హాస్టళ్లను టీడీపీ ప్రభుత్వం అందంగా ముస్తాబు చేస్తుంటే చూసి ఓర్వలేక వైసీపీ పార్టీ లేని పోని ఆరోపణలు చేయడంతో పాటు తమ మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు ప్రచారం చేస్తుంది. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని విద్యార్థులకు మేనమామను అని చెప్పుకోవడం తప్ప విద్యార్థులకు చేసింది ఏమి లేదు.

## ప్రమాదవశాత్తు గాయపడిన వ్యక్తికి ఆర్థిక సహాయం



**ఉదయగిరి, జులై 28, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని గంగులవారిచెరువుపల్లికి చెందిన జనసేన కార్యకర్త చిన్న పెంచలయ్యకు ఆర్థిక సహాయం చేసిన కొట్టే వెంకటేశ్వర్లు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయగిరి మండలం, గంగులవారిచెరువుపల్లి గ్రామంకి చెందిన తమ్ములూరి చిన్న పెంచలయ్య గత వారం నందిపాడు దగ్గర ప్రమాదం జరిగి చెన్నైలోని విజయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ విషయాన్ని ఉదయగిరి నియోజకవర్గ జనసేన పార్టీ పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు తెలుసుకుని గంగులవారిచెరువుపల్లిలోని వారి కుటుంబ సభ్యులను కలిసి చిన్న పెంచలయ్య ఆరోగ్య పరిస్థితి గురించి విచారించి కాలుకి ఆపరేషన్ చేయాలని వారు తెల్పడంతో వైద్య ఖర్చుల కొరకు తక్షణ సహాయంగా 10 వేలు, జనసేన పార్టీ అడ్వకేట్ కాకు మురళీకృష్ణ, అడ్వకేట్ బార్ అసోసియేషన్ తరుపున 10 వేలు రూపాయలు వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సందర్భంగా కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జనసేన పార్టీకి చెందిన చిన్న పెంచలయ్య ప్రమాదవశాత్తు గాయపడటం చాలా బాధాకరమని, ప్రమాదంలో కాళ్ళకు తీవ్రమైన గాయాలు కావడం జరిగిందని, జనసే పార్టీ తరుపున ఈ రోజు వారికి రూ.20వేలు తక్షణ సాయంగా అందించడం జరిగిందని పెంచలయ్య త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నానని, వారి కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని, ఈ విషయాన్ని పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి వారి కుటుంబానికి సహాయం అందేలా కృషి చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి ఆల్లూరి రవీంద్ర, ఉదయగిరి మండల అధ్యక్షులు కల్లూరి సురేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు అనంతశెట్టి ఏడుకొండలు, ఇతర మండలాల అధ్యక్షులు పాలిశెట్టి శ్రీనివాసులు, రసూల్ పటాన్, రవికుమార్, జనసేన ఉదయగిరి మండల నాయకులు కుర్ర కృష్ణ, పసుపులేటి తిరుపతయ్య, పెట్ల కిరణ్ కుమార్, జనసైనికులు నేరుకట్టు కృష్ణ, విష్ణు, వెంకటేశ్వర్లు, హరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందుపూరుపురిణి గ్రామాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ



అల్లూరు, జులై 28 ప్రభాతవార్త: సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా అల్లూరు మండల పరిధిలోని ఇందుపూరు. పురిణి గ్రామాల్లో కావలి శాసనసభ్యులు దగుబాటి వెంకట కృష్ణారెడ్డి. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొన్నారు. ముందుగా ఇందుపూరు ఎస్టీ కాలని వద్దకు శాసనసభ్యులు వెంకటకృష్ణారెడ్డి,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర చేరుకోగానే కాలనీవాసులు తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకుని ప్రభుత్వ అందిస్తున్న పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకొని వారు తెలిపిన సమస్యలను యాప్‌లో పొందుపరిచారు. గ్రామంలో 25 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. అదేవిధంగా నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే. ఎమ్మెల్సీతో ప్రారంభించారు. అనంతరం శాసనసభ్యులు వెంకట కృష్ణారెడ్డి. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి సంక్షేమాన్ని అమలు చేస్తూ స్వర్ణాంధ్ర వైపు అడుగులు వేస్తూ పరిపాలన కొనసాగిస్తున్నారని సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు,దీపం పథకం,తల్లికి వందనం అన్న క్యాంటీన్లు 16,347,పోస్టులతో మెగా డీఎస్సీ అమలు చేయగా ఆగస్టు 15 నుండి మహిళలకు విజేత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నారని తెలిపారు. లోక్ సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వగ్రామైన ఇందుపూరులో ఆయన సహకారంతో ఎంపీ నిధు లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం పురిణి గ్రామంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ లక్ష్మీనారాయణ. తెలుగుదేశం నాయకులు బీద గిరిధర్,దేవిరెడ్డి దశరధరామిరెడ్డి, ఏలూరు వసంతకుమార్,పలగాటిశ్రీనివాసులురెడ్డి,రేబాల శంకర్‌రెడ్డి, అంబటి రాజేంద్ర, ఎందేటి హరికృష్ణ, మేడ కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్‌రెడ్డి,బండి శ్రీనివాసులురెడ్డి,రామి శెట్టి కృష్ణచైతన్య,నీలపరెడ్డి హరీష్ కుమార్ రెడ్డి, కత్తులశ్రీకాంత్, మునిరాజా, షేక్ ఇస్మాయిల్,కావాలిజగన్ రుద్రయ్య,ఆటతిరుమల, కాళహస్తి వెంకటేశ్వర్లు,ఏరాసు మురళి,చాగంటి రామకృష్ణ తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన అవసరం



**కోవూరు జులై28 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పడుగుపాడు పంచాయతీ ఎన్టీఆర్ గిరిజన కాలనీలో సోమవారం సబ్ యూనిట్ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతపై మరింత అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, హెచ్‌ఎస్ సురేష్, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

## ఎమ్మెల్యే కాకర్లపై అసత్యప్రచారాలుచేస్తే సహించేదిలేదు

## జలదంకి మండలం టిడిపి నేతలు హెచ్చరిక



**కావలి, రూరల్, జులై 28, ప్రభాతవార్త:** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అసత్యప్రచారాలు చేస్తే సహించేదిలేదని వారికి తగిన బుద్ధిచెప్పి తీరుతామని జలదంకి మండల తెలుగుదేశంపార్టి కన్వీనర్ పులిగుంట మధుమోహన్‌రెడ్డి,జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు వంటేరు జయచంద్రారెడ్డి,టిడిపి ఉదయగిరి నియోజకవర్గ రైతుసంఘ అధ్యక్షుడు పూనూరు భాస్కర్‌రెడ్డి,మండల టిడిపి సీనియర్ నాయకుడుకరియావుల అప్పలనాయుడులు హెచ్చరించారు.కావలి పట్టణంలోని జర్నలిస్ట్‌క్లబ్‌లో సోమవారం వారు మండలంలోని టిడిపి నేతలతో కలసి విలేఖర్ల సమావేశం నిర్వహించారు.అనంతరం వారు మాట్లాడారు.జలదంకి మండలంలోని గట్టుపల్లి రెవెన్యూ పరిధిలో 98 ఎకరాల మామిడితోటను సదాశివరావు,తలసిల నరసింహారావు అనే వ్యక్తులు కొన్నారని తెలిపారు.అయితే దానిలో88ఎకరాలు సదాశివరావుది కాగ 8ఎకరాల96సెంట్లు నరసింహారావు పేరుమీద వున్నట్లు చెప్పారు. అయితే 30 ఎకరాలు తలసిల నరసింహారావుకు అగ్రిమెంటు రాసి వుందంటు వారిద్దరిమధ్య భూవి వాదం తలెత్తిందని ఇరువురు ఓయూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూలో చెప్పుకున్నట్లు తెలిసిందన్నారు.అయితే ఆతోటలో కాపును ఎమ్మెల్యేకాకర్ల కోయించుకున్నాడని సదాశివరావు నిందారోపణలు చేయడంమంచిపద్ధతి కాదన్నారు.ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉన్నత విద్యను అభ్యసించి ఎన్ఆర్ఐగ సెటిలై ప్రజాసేవ చేయడంకోసం కాకర్ల చారిటబుల్ ట్రస్ట్‌ద్వార ఎంతోమంది పేదలకు సహాయ,సహకారాలు అందించారని అన్నారు.ఆయన కష్టపడి సంపాదించిన నగదును పేదప్రజలకు సహాయ సహకారాలు అందిస్తుంటే మామిడి తోటలో పండ్లు కోయించాల్సిన దుస్థితి ఆయనది కాదని,స్థాయిని మరచి మాట్లాడితే తగినబుద్ధి చెబుతామని హెచ్చరించారు.మామిడితోటలో భూవివాదంవుంటే అది మీరుమీరు తేల్చుకోవాలని అలాకాకుండ ఎమ్మెల్యే పై ఆరోపణలుచేస్తే చూస్తు ఊరుకునేదిలేదని అన్నారు.మరోమారు ఇలాంటి ఆరోపణలు చేస్తే తీవ్రపరి ణామాలు వుంటాయని హె చ్చరించారు.సదాశివరావు వెనుక కొందరు వైసిపి నేతలు వుండి మాట్లాడి స్తున్నారని వారికి కూడ బుద్ధిచెప్పితీరుతామని మండిపడ్డారు.ఈకార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు మునగాల వెంకటేశ్వర్‌రెడ్డి,ఉన్నంరవి,మాదిరెడ్డిసుబ్బారెడ్డి,జాజులశివరామయ్య,కంచర్ల,వినోద్‌నాయుడు,బడేవెంకటేశ్వరరెడ్డిశెట్టిపల్లిశ్రీనివాసులు,గునపాటిబాబుల్‌రెడ్డిమరికొంతమంది మండలసీనియర్‌నాయకులు పాల్గొన్నారు.

## దుర్వాసన వెదజల్లుతుంది.. పరిష్కరించండి



**కోవూరు జులై28 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని 13వ వార్డు సాయిబాబా మందిరం వద్దగల దొమ్మరిపాలెం ప్రాంతంలో అనేక సమ స్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరి ంచాలంటూ ఆ ప్రాంత ప్రజలు టీడీపీ సీనియర్ నేత నాటకరాణి వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ ప్రాంత సమీపంలో చెరువు ఉందని, ఆ ప్రాంతంలో అదే ప్రాంతానికి చెందిన ఎం. శారద అనే మహిళ ఇంటి ముందు బాత్రూమ్ కట్టి వేస్ట్ అంతా చెరువులోకి వదులుతుందని , దీని వలన ఆ ప్రాంత ప్రజలకు దుర్వాసన వెదజల్లుతుందని వెంటనే దీనికి పరిష్కారం చూపాలని తహసీల్దార్‌కు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెంటనే పరిశీలించి తగు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ ఆ ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంతానికి చెందిన ఎం. శంకర్, విజయ కుమార్, రమేష్, రాజేష్, కృష్ణ, తదితరులు ఉన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు జులై28 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని ఎంఈవో-2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరు మండలం చంద్రశేఖరపురం గిరిజన కాలనీలో ఉన్న ప్రభుత్వ పాంశాలలను సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పథకంలో ప్రభుత్వం సూచించిన మెనూను తప్పక అమలు పరచాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

## గ్రామస్తులతో మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి

## సమస్యలుంటే తెలపండి

– పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం



**కోవూరు జులై28 ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు పంచాయతీ అట్ల కాలనీ, తదితర ప్రాంతాల్లో తేలికపాటి సమస్యలు ఉన్నాయని, వాటిని సకాలంలో పరిష్కరించేలా ఎమ్మెల్యే సహకారంతో తగు చర్యలు తీసుకుం టా మని మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాలతో ప్రజలతో మమేకం అనే కార్యక్రమాన్ని అట్ల కాలనీ గిరిజన ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని సకాలంలో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామన్నారు. నూతనంగా రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఆగస్టు 15వ తేది నుంచి మహిళలకు ఫ్రీ బస్సు అందించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించారన్నారు. ఇటువంటి మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకున్న ప్రజలకు ఎంపీటీసీ సభ్యుడు సునీల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉప సర్పంచ్ సీహెచ్ మోహన్, పి. శ్రీనివాసులు, ఎస్, శీనయ్య, ఎస్‌కే మాబాషా, ఎస్. చైతన్య, నాగరాజు, తదితరులు ఉన్నారు.

## ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంబెడెడ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు జులై28 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో భారత సాంకేతిక విద్యా సమితి భాగస్వామ్యంతో ఎంబెడెడ్ సిస్టమ్స్ ఇండస్ట్రియల్ ఐవోటీ అనే అంశంపై రెండవ సంవత్సరం ఈసీ విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ యు. పెంచలరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంబెడెడ్ సిస్టమ్స్, వీటితో పాటు ఇండస్ట్రియల్ ఐవోటీ రంగాల్లో అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ కార్యక్రమ సమన్వయకర్త జి. కిరణ్‌కుమార్ ఇండస్ట్రియల్ ఐవోటీ రంగాల్లో పరిశ్రమలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ఇటువంటి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమానికి రొబోమాన్ టెక్నాలజీస్ సంస్థ డొమైన్ నిపుణులు, శ్రీ సిరిల్, శ్రీ చరణ్‌లు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రావణ్‌కుమార్ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎస్ఈ విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

## శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి ఆలయంలో
### అన్నదానానికి లక్ష రూపాయాలు విరాళం



**బుచ్చి జులై 28 ప్రభాతవార్త** బుచ్చిరెడి పాళెం మండలంలోని పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో అన్నదాన కార్యక్రమానికి చెన్నై నగరం ముగలివాకంకి చెందిన కె మల్లి కార్జున, ప్రభావతి దంపతులు వారి కుటుంబసభ్యులు శ్రీవార్ల నిత్య అన్నదానానికి లక్ష రూపాయాలు విరాళం అందజేశారు. దేవ స్థాన సహాయ కమీషనర్కార్య నిర్వహణా ది.కారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డికి వారు చెక్కులు అందజేశారు. దాతలకు శ్రీవార్ల దర్శనం కల్పించి ప్రత్యేకంగా పూజలుజరిపించారు. స్వామి అమ్మవార్ల శేష వస్త్రం,కుంకుమ తీర్ధ ప్రసాదాలు దాతలకు అందజేశారు.

## భవన నిర్మాణ కార్మికులకు పక్కా గృహాలు మంజూరు చేయాలి



**సైదాపురం, జులై 28, ప్రభాతవార్త** భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు అధికారులు మంజూరు చేయాలని ఐఎఫ్టీయు జిల్లా గౌరవ అధ్యక్షుడు డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. భారత కార్మిక సమైఖ్య సంఘాల మండల కార్యవర్గం ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేతపట్టుకుని సైదాపురం బస్టాండ్ సెంటర్లో రాస్తారోకో నిర్వహించి స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.పోలయ్య మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్దిలో కీలక పాత్ర పోషిస్తున్న భవన నిర్మా ణ కార్మికులు సుమారుగా 40 రకాల వృత్తులలో పని చేస్తూ భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్నారని, గడిచిన ఆరు సంవత్సరాలుగా ఉపాధి కోల్పోయి కార్మికులు దుర్భర జీవితం గడుపుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణ కార్మికులు బాడుగుల ఇళ్లల్లో ఉంటూ బాడుగలు కట్టలేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. సైదాపురం మండలంలో మొలకలపూండ్ల గ్రామ రెవెన్యూలోని సర్వే నెంబరు 883 నందు ఉన్న 13 ఎకరాల ప్రభుత్వ భూమి భవన నిర్మాణ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆయన అన్నారు. చెంగలరావు, డేగా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అపస్మా పాఠశాలల కరస్పాండెంట్స్‌కు శిక్షణా తరగతులు




**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త-విద్య** : అపస్మాలోని ప్రైవేట్పాఠశాలల కరస్పాం డెం ట్స్ కు ఆదివారం నగరంలోని స్థానిక బ్రంహ నందపురంలోని అవెన్యూ సీనియర్ సెకం డరీ పాఠశాలలో శిక్షణా తరగతులను నిర్వ హించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతి ధిగా అపస్మా రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పాఠశాలలపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా తరగతులు నిర్వహించాలని కోరారు. విద్యార్థులకు సాంకేతికతతోపాటూ సమాజం పట్ల మంచి భావం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలోని అపస్మా పాఠశాలల్లో సుమారు 45 లక్షలమంది విద్యార్థులు విద్యను అభ్యశిచంటం జరుగుతుందని, వారికి ఉత్తమ విద్యను అందించే కరస్పాండెంట్స్ కూడా శిక్షణ తీసుకోవటం శుభపరిణామమన్నారు. అపస్మా జిల్లా అధ్యక్షులు నేల నూతల శ్రీధర్ మాట్లాడుతు తమ సంస్థ ఆధ్వర్యంలో కరస్పాండెంట్స్‌కు శిక్షనా తరగుతుల నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. అలాగే పాఠశాల నిర్వహణల్లో మెలకువలు అందించిన బిఎన్. మూర్తి, న్యాయసలహాలకు సంబందించినవివరాలను విజయ్ హైకోర్టు అడ్వకేట్,లకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. నిపుణుల సలహాలు, సూచలను పాటిస్తూ ప్రభుత్వ నిబందలను అనుగుణంగా తమ విద్యా సంస్థలను నడిపిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అందరూ కృషిచేయ్యాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి రామ్మెహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటాద్రి, కోశాధికారి కృష్ణారావు, నగర అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఈ అభియాన్ సిఈఓ డాక్టర్ ఫణి పవన్‌శర్మ, డెల్టా పబ్లికేషన్స్ డైరెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి ఆనంచే,పలు అభివృద్ధి పనులకు
### ప్రారంభోత్సవాలు,శంకుస్థాపనలు



**చేజర్ల జులై 28 ప్రభాతవార్త** చేజర్ల మండలం తూర్పు కంభంపాడు గ్రామంలో సోమవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంబోత్సవాలకు శంకుస్థాపనలు జరిపారు. కూటమి ప్రభుత్వ విజయాలను ప్రతి గడపలకు తెలియజేసే క్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు.ఈ సందర్భంగా ఒక్కకోటి 95 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభించారు. 50 లక్షల నిధులతో నీల కంఠేశ్వరస్వామి ఆలయఅభివృద్ధి పనులకు ,25 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ప్రతి ఇంటికి మంచి నీటిని అందించే పథకానికి శంకుస్థాపనలు చేశారు. 22.50 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయితీ భవనాన్ని 7 లక్షలతో నిర్మించిన పార్కును ప్రారంభించారు. సుమారు 3 కోట్లు రూపాయాలు విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంబోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివాసులునాయుడు, మాజీ సర్పంచ్ కొమ్మి రమేష్‌నాయుడు, మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి
### అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫిరెన్స్



**నెల్లూరు కలెక్టరేట్, జూలై 28, ప్రభాతవార్త** వివిధ శాఖల మండల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్‌లో పిజిఆర్ఎస్ ఆర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి ఉపాధి హామీ పనులు పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మొదలైన అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, మున్సిల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్‌లు ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తల్లికి వందనం అన్నదాత సుఖీభవ తదితర పథకాలను అర్హులకు అందజేయడానికి వీలుగా జాయింట్ ఎల్పీఎంలను త్వరగా సబ్ డివిజన్ చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట ఆధార్ డీ లింకింగ్‌కు కూడా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా మరణించిన వారి విషయంలో వారి వారసులకు ముటేషన్లు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పిజిఆర్ఎస్ అర్జీలను నిర్దిష్ట గడువులోగా క్వాలిటీతో కూడిన పరిష్కారాలను చూపాలన్నారు. సిటిజన్ ఫిడ్‌బాక్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనులు పురోగతి మెరుగుపడాల్సి ఉందన్నారు. ముఖ్యంగా ఆప్షన్ 3కి సంబంధించిన సర్వేను మూడు రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాలను క్వాలిటీతో పూర్తి చేస్తేనే బిల్లులు చెల్లిస్తామని సంబంధిత కాంట్రాక్టర్లకు తెలియజేయాలన్నారు. హౌసింగ్‌లో ఉపాధి హామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఎపివోలు ఉపాధి హామీ పనిదినాలు కల్పించాలన్నారు. జిల్లాలోని విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరేలా ఒకటో తరగతిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేలా చర్యలు చేపటట్టాలన్నారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని మంచినీటి వసతి సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. మండల అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫిరెన్సులో జాయింట్ కలెక్టర్ కె. కార్తీక్, డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్, జడ్పిసిఈవో మోహన్ రావు, హౌసింగ్ డ్వామా పిడిలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్ఈ విజయన్, డిఈఓ బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట : మంత్రి ఆనం



**చేజర్ల జులై 28 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం అన్ని విధాల కృషి చేస్తుందని రాష్ట్ర దే వాదాయశాఖ మంత్రి ఆనం రామనారా యణరెడ్డి పేర్కొన్నారు.ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మంలో భాగంగా చేజర్ల మండలంలోని తూర్పు కంభంపాడు గ్రామంలో గిరిజన కాలనీలో సోమవారం గిరిజనులతో సమావేశం అయ్యారు. గిరిజన కాలనీలో ఇంటింటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. గిరిజన కాలనీలోని అన్ని సమస్యలను ఒక్కొక్కటిగా తెలుసుకొని వారికి అక్కడిక్కడే పరిష్కరించారు. విద్యార్థుల చదువుపై శ్రద్ధచూపమని విద్యే జీవితంలో అనూహ్యంగా మారుస్తుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన తల్లికి వందనం పథకాన్ని అందుతున్న ప్రక్రియను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రజకకాలనీలో పాల్గొని వారి సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీనాయకులు, మాజీ ఎంపిపి అన్నలూరు శ్రీనివాసులు నాయుడు,మాజీ సర్పంచ్ కొమ్మిరమేష్‌నాయుడు, మండల అధికారులు, తెలుగు దేశం పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ప్రస్తుత విధానంలోనే కార్మికుల విధులు కొనసాగుతాయి

**- కార్మికులందరూ ఆప్కాస్ ద్వారానే జీతాలు అందుకుంటారు**

**- సమ్మె సమయంలో ప్రజలందరూ సహకరించాలని విజ్ఞప్తి : కమిషనర్ వై.ఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్,జులై 28 ప్రభాతవార్త:**నెల్లూరు నగరపాలక సంస్థ కార్మికులు పూర్తిస్థాయిలో ప్రస్తుత విధానంలోనే వారి విధులను కొనసాగిస్తారని, ఆప్కాస్ ద్వారానే క్రమం తప్పకుండా జీతాలను అందుకుంటూ ఉద్యోగ భద్రతకు పూర్తి భరోసా ఉంటుందని కమిషనర్ వై.ఓ నందన్ స్పష్టం చేశారు. గత 14 రోజులుగా మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్న సందర్భాన్ని పురస్కరించుకొని కార్పొరేషన్ కార్యాలయం కమిషనర్ చాంబర్లో విలేకరుల సమావేశాన్ని కమిషనర్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పురపాలక శాఖ మంత్రి పి నారాయణ ఆలోచనల మేరకు నెల్లూరు నగరంలో 100 పారిశుద్ధ్య పనులుతో, అత్యంత పరిశుభ్రమైన మోడల్ డివిజన్ నిర్వహణలో పైలెట్ ప్రాజెక్టు కొరకు కాంట్రాక్టు పద్ధతిలో ప్రయోగాత్మకంగా చేపట్టామని తెలిపారు. కాంట్రాక్ట్ విధానంలో ప్రస్తుత కార్మికులను చేర్చడం, వారి ప్రస్తుత విధి విధానాలను మార్చడం వంటివి జరగవని స్పష్టం చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జనాభా పెరుగుదల రేటు, పట్టణ అభివృద్ధి వంటి వివిధ కారణాలను దృష్టిలో ఉంచుకొని అదనపు కార్మికుల ద్వారా వివిధ రకాల సేవలను అందించేందుకు నూతన విధానం ద్వారా అమలు చేసేం దుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని కమిషనర్ తెలిపారు. కేవలం మున్సిపల్ శాఖలో మాత్రమే కా కుండా అన్ని శాఖలలో కాంట్రాక్టు విధానం ద్వారా అవసరమైన సేవలను అందించేందుకు అదనపు కార్మికుల నియామకం గురించి యోచిస్తున్నామని తెలిపారు. కావున నెల్లూరు నగర పాలక సంస్థ లో పనిచేస్తున్న పారిశుద్ధ్య విభాగం, ఇతర విభాగాల కార్మికులందరూ ఈ విషయాలపై అవగాహన పెంచుకుని తమ విధు లకు, జీతాలకు ఎలాంటి నష్టం వాటిల్లబోదని అర్థం చేసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు.నెల్లూరు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె నేపథ్యంలో నగర ప్రజలందరూ సంయమనం పాటించి సహ కరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

## పరిశుభ్రతోనే ప్రజారోగ్య రక్షణ
### : చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ



**బుచ్చి జులై 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణాన్ని పరి శుభ్రంగా ఉంచండి, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర కీలకం అని శానిటేషన్ వర్క ర్స్‌కు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర చాలా కీలకమన్నారు. బుచ్చి రెడ్డిపాళెం పట్టణంలోని నగర పంచాయితీ మస్టర్ కేంద్రాన్ని సంద ర్శించారు. ఆమె విధి నిర్వహణ పట్ల అంకిత భావంతో ఉండాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. పట్టణంలోని వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని సూచించారు. అపరిశుభ్రత వలన వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఇళ్ళు,హోటళ్ళలోని వ్యర్థాలను డస్టు బిన్స్‌లో వేసి పారిశుద్ధ్య కార్మికులతో సహకరించాలని ఆమె పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. క్లీన్ బుచ్చిరెడ్డిపాళెం సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె కాంక్షించారు.ఈకార్యక్రమంలో వెంట సిబ్బంది ఉన్నారు.

## ప్రజాసక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే



**వలేటివారిపాలెం జూలై 28, ప్రభాతవార్త** ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందుకు అవసరమైన అన్ని చర్యలపై ఆర్టీసీ కసరత్తు చేస్తుందన్నారు.ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. సోమవారం వలేటివా రి పాలెంలో సుపరిపాలనలో తొలి ఎడాది పాలన కార్యక్రమం నిర్వహించారు.స్థానిక ఎస్సీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర భ్ంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నేతలు ఇంటి ంటికి తిరుగుతూ ఏడాది పాలనను విశదీకరించారు. కరపత్రాలను పంపిణీచేశారు. వైసీపీ పాలనలో ప్రజలు విసిగి వేశారినట్లు తెలిపారు.ఎన్నికల హామీల మేరకు పాలన కొనసాగుతుందన్నారు.పెన్షన్ పెంపుదల, ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ తదితర హామీలు సునాయసంగా అమలు చేస్తున్నట్లు తెలి పారు.గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు.గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేని గ్రామస్తులు ఘనంగా స్వాగతించారు.సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర ్పంచ్ శ్రీలత,తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం,సొసైటీ మాజీ అధ్యక్షులు వలేటి నరసింహం,గుత్తా మహేశ్వర రావు,తెదేపా నేతలు వలేటి మధు,కొంకా రమేష్,మన్నం మాదవరావు,కాకుమాని మాల్యాద్రి, వీరమాసు ఆం జనేయులు,మాలకొండ మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి,కూనిపాలెం సర్పంచ్ రాజారమేష్, మాజీ డీలరు కాకుమాని ఆంజనేయులు, సాధు చెన్నకేశవులు,చెరువుపల్లి సాంబయ ్య,పోకూరు నుంచి లక్ష్మినం ఽసింహం, సోమినేని తిరుమలరావు,నల్లబోతుల కొండలరావు,చుండి రాఘవులు,పోలినేనిచెరువు మాల్యాద్రి, అంకభూపాలపురం నుంచి మోహన్,బక్కముంతల మాల్యాద్రితోపాటు పలు గ్రామాల నుంచి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**డ్రైవరు పోస్టులకు ధరఖాస్తు-డీఎం** ఆగస్టు 15 నుంచి మహిళలకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న దృష్ట్యా తాత్కాలిక డ్రైవరు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ధరఖాస్తు చేసుకోవాలని కందుకూరు డిపో మేనేజర్ శ్రీనివాసరావు ప్రభాతవార్తతో తెలిపారు.రోజుకు రూ.800లకి పైగా వేతనం చెల్లించే అవకాశం ఉందన్నారు.అర్హతలతోకూడిన నిర్ణీత ధరఖాస్తును కందుకూరు డిపో కార్యాలయంలో అంద చేయాలన్నారు. పూర్తి వివరాలకు డీపోలో సంప్రదించాలని సూచించారు.

## కోలాహాలంగా మారిన బీద కార్యాలయం



**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సభ్యులతో 2025-26 సంవత్సరానికి గాను ఏర్పాటు చేసిన ఉభయ సభల సంయుక్త కమిటీలలో శాసనమండలి సభ్యులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవి చంద్రకి చోటు దక్కింది. వెనుకబడిన వర్గాల(బీసీ) సంక్షేమ కమిటీ చైర్మన్, శాసన మండలి సభా నియమాల కమిటీ సభ్యుడిగా బీద రవిచంద్ర నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలు బీసీ సంఘాల నేతలు పుష్పగుచ్చాలు, పూలమాలలు, శాలువాలతో బీద రవిచంద్రని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ సాధికార సమితి కన్వీనర్ పీఎల్ రావు నేతృత్వంలో బీసీ నేతలు బీద రవిచంద్రని గజమాలతో సన్మానించారు. బీద రవిచంద్రకి శుభాకాంక్షలు చెప్పేందుకు వచ్చిన టీడీపీ శ్రేణులతో నెల్లూరు నగరం మాగుంట లేఅవుట్‌లోని వారి కార్యాలయం కిక్కిరిసింది.

## నిమ్మచెట్లు తొలగింపులో టీడీపీకి సంబంధం లేదు



**సైదాపురం, జులై 28, ప్రభాతవార్త** సైదాపురం పరిధిలోని మొలకలపూండ్ల గ్రా మ రెవెన్యూలో ఉన్న సర్వే నెంబరు 793 లోని ప్రభుత్వ భూములో రైతు సాగు చేసుకుంటున్న నిమ్మచెట్లు తొలగించిన విషయంలో తెలుగుదేశం పార్టీకి గాని, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు గాని, మండల పార్టీ నాయకులకు గాని ఎటువంటి సంబంధం లేదని తెలుగుదేశం పార్టీ నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, పెమ్మసాని దిలీప్‌చౌదరి, అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం మండల పార్టీ నాయకులతో కలిసి వారు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు నిమ్మచెట్లు తొలగింపులో ఎటువంటి సంబంధం లేదని, పార్టీకి సంబంధం లేని ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు ప్రభుత్వ అధికారులు నిమ్మచెట్లను తొలగించడం జరిగిందని వారు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ పేదవాళ్ళను ఇబ్బందిపెట్టే పార్టీ కాదని వారు అన్నారు. వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి టీడీపీ పార్టీ వాళ్ల నిమ్మచెట్లు తొలగించారని అనడం సబబు కాదని, మా ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఎప్పుడు పేదల పక్షాన ఉంటారని తెలిపారు. గతంలో కూడా ఈ ప్రాంతంలోని భూములను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించి అక్కడ సాగు చేసుకుంటున్న పేద రైతులకు పట్టాలు ఇచ్చే విధంగా కృషి చేస్తానని చెప్పడం జరిగిందని వారు అన్నారు. కాబట్టి నిమ్మచెట్లు తొలగింపులో టీడీపీపై బురదచల్లడం సరైంది కాదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్య నాయుడు, కేపీ రాజు, వరిగొండ సురేంద్ర, దశయ్యనాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, విజిల్‌రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కలర్స్ మున్నా డాన్స్ 23వ వార్షికోత్సవ వేడుకలలో ఎమ్మెల్యే







**కావలిరూరల్,జులై28ప్రభాతవార్త** కావలి పట్టణం మొగల్ హబీబ్ బేగ్ షాధి మందిర్‌లో ఆదివారం రాత్రి రాక్‌న్ రోల్ డాన్స్ మాస్టర్ కలర్స్ మున్నా డాన్స్ 23వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. దీంతో సభా ప్రాంగణంలో పండగ వాతావరణం నెలకొంది. డాన్సర్‌తో ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికిన మున్నా డ్యాన్స్ మాస్టర్, కళాకారులు, వార్డు నాయకులు. అనంతరం మాజీ ఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పూలవాలవేసి నివాళురల్పించారు. డాన్స్ మాస్టర్ మున్నా ఆధ్వర్యంలో జరిగిన డాన్స్ పోగ్రాంని ఎమ్మెల్యే తిలకించారు.ఎమ్మెల్యే మీద కంపోజ్ చేసిన స్పెషల్ సాంగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కావ్యా క్రిష్ణారెడ్డి, కళాకారులను అభినందించి ఘనంగా సన్మానిం చారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్న కలర్స్ మున్నా డ్యాన్స్ టీం ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఇటువంటి మంచి కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా వుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఎంతో కష్టపడి మున్నా ఈ స్థాయికి రావడం అభినందనీయమన్నారు. కావలి నియోజకవర్గంలో వున్న కళాకారులను అన్ని విధాలుగా అండగా వుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

## మన్నెమాలకు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పరమార్శ



**కావలిరూరల్,జూలై28ప్రభాతవార్త** కావలి మాజీ ఏయంసీ చైర్మన్ మన్నె మాల సుకుమార్ రెడ్డిని సోమవారం అల్లూరు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పరమార్శించారు. ఇటీవల సుకుమార్ రెడ్డి తల్లి అన్న పూర్ణమ్మ కాలం చేయడంతో విష ్ణువర్ధన్ రెడ్డి కావలి టీచర్స్ కాలనీలోని సుకుమార్ రెడ్డి నివాసానికి చేరుకోని ఆయనను పరమార్శించి అన్నపూర్ణమ్మ మృతికి కారణాలను తెలుసుకోని వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయన వెంట పలువురు నాయకులు,కార్యకర్తలు వున్నారు.

## డెంగ్యూ నివారణపై అప్రమత్తంగా ఉండండి

**- పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే వ్యాధులు ధరిచేరవు**

**- జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ**



**నెల్లూరు, జులై 28, ప్రభాతవార్త- వైద్యం** జాతీయ డెంగ్యూ మాసోత్స వాల్లో భాగంగా సోమవారం జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ, మహాత్మాగాంధీ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కార్పొరేషన్ హైస్కూల్లో విద్యార్థులు పరిసర ప్రాంతాల ప్రజలకు కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. జ్వరాల భారిన పడినప్పుడు వ్యాధి నిర్ధారణ చేయించుకుని, నివారణ మార్గాలను అన్వేషించాలని కోరారు. కొబ్బరిబోండాలు, పాత టైర్లలో నీటి నిల్వలు చేరినప్పుడు దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ఇంటి పరిసరాల్లో పాడుబడ్డ వస్తువులు లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయులు వేదమూర్తి, ఉపాధ్యాయులు స్థానిక ఆరోగ్య కేంద్రం కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, మలేరియా పట్టణ విభాగం సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, సచివాలయం ఆరోగ్య కార్యదర్శి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీగురప్ప స్వామికి ప్రత్యేక పూజలు



**వింజమూరు, జులై 28, ప్రభాతవార్త** వింజమూరు నడిమూరు నందు వేంచేసియున్న శ్రీగురప్ప స్వామి అంకాలమ్మ నాగవరపమ్మ అమ్మవారికి శ్రావణ మాస సోమవారాన్ని పురష్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. జి. గురవారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అమ్మ వార్లకు ఉదయాన్నే ప్రత్యేక అబిషేకములు జరిపించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామి వా రిని అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించి కాయ కర్పూరం చెల్లించి తీర్ధ ప్రసాదాలు స్వీకరించి పునీతులయ్యారు. కార్యక్రమాలను గురువారెడ్డి పర్యవేక్షించారు.